



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక · PEN POWER TELUGU DAILY · ప్రశ్నించడం మన హక్కు






సంపుటి : 11 | సంచిక : 293 | పేజీలు : 8+8 | ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ : పి. గౌతమి | శనివారం 28 జూన్ 2025

Published form Medchal Malkajgiri, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda


## కేసీఆర్, కేటీఆర్ జైలుకు
# వెళ్లాల్సిందే

- ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణకు హాజరైన ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి
- కేసీఆర్, కేటీఆర్‌లకు శిక్ష పడితేనే ఇలాంటివి పునరావృతం కాబోవని వ్యాఖ్య
- ట్యాపింగ్‌పై ఫిర్యాదు చేసినందుకే తనపై కక్ష సాధింపు చర్యలు చేపట్టారని ఆరోపణ
- ఈ వ్యవహారాన్ని పార్లమెంటులో ప్రస్తావిస్తానని స్పష్టం చేసిన ఎంపీ





**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణలో సంచలనం రేపుతున్న ఫోన్ ట్యాపింగ్ కేసులో భాగంగా బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి శుక్రవారం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఎదుట విచారణకు హాజరయ్యారు. విచారణ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్‌లపై తీవ్ర విమర్శలు చేశారు. ఫోన్ ట్యాపింగ్ వంటి దుశ్చర్యలకు పాల్పడినందుకు వారికి కచ్చితంగా శిక్ష పడాలని, వారిద్దరూ జైలుకు వెళ్లాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కేసు విచారణలో భాగంగా సిట్ అధికారులు జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో విశ్వేశ్వర్‌రెడ్డిని ప్రశ్నించి, ఆయన వాంగ్మూలాన్ని నమోదు చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, తాను గతంలో ఫోన్ ట్యాపింగ్‌పై ఫిర్యాదు చేసినందుకే తనపై కక్షపూరితంగా తప్పుడు కేసులు బనాయించారని ఆరోపించారు. "గతంలో నా ఫోన్ చాలాసార్లు ట్యాప్ అయింది. దీనిపై నేను అప్పుడే ఫిర్యాదు చేశాను. ఇప్పుడు ఈ వ్యవహారంపై పూర్తిస్థాయి విచారణ జరగాలి" అని ఆయన అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఫోన్ ట్యాపింగ్ ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే కేసీఆర్, కేటీఆర్‌లకు కఠిన శిక్ష విధించాలని విశ్వేశ్వర్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. ఈ అంశాన్ని పార్లమెంటు సమావేశాల్లో కూడా ప్రస్తావించి, జాతీయ స్థాయిలో చర్చిస్తానని ఆయన స్పష్టం చేశారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని సమగ్రంగా నిరూపించేందుకు అవసరమైతే కేంద్ర ప్రభుత్వ సహాయం కూడా తీసుకోవాలని ఆయన సూచించారు.

## తిరుమల కల్తీ లడ్డూ కేసు... సుప్రీంకోర్టుకు సిట్ నివేదిక



- రెండు రోజుల క్రితం సీల్డ్ కవర్‌లో నివేదిక సమర్పణ
- దర్యాప్తు పురోగతి, నిందితుల పిటిషన్ల వివరాలు వెల్లడి
- విచారణకు నిందితులు ఆటంకాలు కలిగిస్తున్నారని ఆరోపణ
- సాక్షులను బెదిరిస్తున్నారని నివేదికలో పేర్కొన్న సిట్

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన తిరుమల లడ్డూ ప్రసాదం కల్తీ వ్యవహారంలో కీలక పరిణామం చోటుచేసు కుంది. ఈ కేసుకు సంబంధించి సిట్ తన విచారణ నివేదికను సర్వోన్నత

వివరాలు 2లో..

## హైదరాబాద్‌లో మరో ఫ్లైఓవర్..
### ప్రారంభానికి ముందే కేటీఆర్ ఆసక్తికర ట్వీట్



- శనివారం గచ్చిబౌలి-కొండాపూర్ ఫ్లైఓవర్ ప్రారంభం
- ప్రారంభించనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- ఫ్లైఓవర్‌కు కాంగ్రెస్ నేత పీజేఆర్ పేరు ఖరారు
- ఇది తమ ప్రభుత్వ ఘనతేనన్న మాజీ మంత్రి కేటీఆర్
- ఎస్‌ఆర్డీపీ కింద 36 ఫ్లైఓవర్లు మేమే కట్టామన్న కేటీఆర్
- మిగిలినవి పూర్తి చేయాలంటూ కాంగ్రెస్‌పై సెటైర్లు

**హైదరాబాద్ పెన్ పవర్:**హైదరాబాద్ నగరవాసులకు, ముఖ్యంగా ఐటీ కారిడార్‌లో ప్రయాణించే వారికి ట్రాఫిక్ కష్టాల నుంచి ఉపశమనం కలిగించేందుకు మరో కీలక ఫ్లైఓవర్

వివరాలు 2లో..

## మంత్రి సీతక్కపై మావోయిస్టుల ఆగ్రహం

- ఆదివాసీల హక్కుల ఉల్లంఘనపై సీతక్క మౌనాన్ని తప్పుపట్టిన మావోలు
- కాంగ్రెస్ తెచ్చిన పెసా, 1/70 చట్టాలను గుర్తు చేసిన మావోయిస్టులు
- జీవో 49ని రద్దు చేయాలని డిమాండ్



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ రాష్ట్ర మంత్రి సీతక్కకు మావోయిస్టుల నుంచి తీవ్ర హెచ్చరిక ఎదురైంది. రాష్ట్రంలో ఆదివాసీల హక్కులకు భంగం వాటిల్లుతున్నా, మంత్రిగా సీతక్క ఏమాత్రం స్పందించడం లేదని మావోయిస్టులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ మేరకు మావోయిస్టు పార్టీ అధికార ప్రతినిధి జగన్ పేరుతో ఈరోజు ఒక ప్రకటన విడుదల కావడం రాజకీయ వర్గాల్లో కలకలం రేపుతోంది.ములుగు జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో అటవీ, పోలీస్ అధికారులు ఆదివాసీలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నా మంత్రి సీతక్క మౌనంగా ఉండటాన్ని వారు తీవ్రంగా తప్పుపట్టారు. గతంలో కాంగ్రెస్ పార్టీయే తీసుకొచ్చిన పెసా, 1/70 చట్టాలను మంత్రిగా సీతక్క విస్మరించారా అంటూ తమ లేఖలో సూటిగా ప్రశ్నించారు. ఆమె గిరిజనుల హక్కుల గురించి మాట్లాడకపోవడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఆదివాసీల హక్కుల పరిరక్షణకు సీతక్క పూర్తి బాధ్యత వహించాలని స్పష్టం చేశారు.ముఖ్యంగా, ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 49పై మావోయిస్టులు

వివరాలు 2లో..

## ఫోన్ ట్యాపింగ్ విచారణ ఏమైనా డైలీ సీరియలా?

- దుబ్బాక నుంచే ఫోన్ ట్యాపింగ్ ప్రారంభం
- మొట్టమొదట తన ఫోనే ట్యాప్ అయిందని వెల్లడి
- సిట్ దర్యాప్తు ఓ డైలీ సీరియల్ అంటూ విమర్శ
- కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఒక్కటయ్యాయని ఆరోపణ
- అన్నపూర్ణ క్యాంటీన్ల పేరు మార్పుపై తీవ్ర ఆగ్రహం
- ఇందిరమ్మ ఇళ్లు కాంగ్రెస్ కార్యకర్తలకే ఇచ్చారంటూ ఆగ్రహం

వివరాలు 2లో..



## లెబనాన్ లోని హెజ్‌బొల్లా స్థావరాలపై ఇజ్రాయెల్ భీకర దాడులు

- ఇజ్రాయెల్ భీకర వైమానిక దాడులు
- హెజ్‌బొల్లా భూగర్భ స్థావరాలే లక్ష్యంగా దాడి
- బంకర్ బస్టర్ బాంబులతో విరుచుకుపడ్డ సైన్యం
- భారీగా దెబ్బతిన్న భవనాలు, పలువురికి గాయాలు

**హైదరాబాద్ పెన్ పవర్:**ఇజ్రాయెల్, హమాస్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో మధ్యప్రాచ్యంలో మరోసారి యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. ఇజ్రాయెల్ తన దృష్టిని లెబనాన్ వైపు సారించింది. శుక్రవారం లెబనాన్‌లోని హెజ్‌బొల్లా ఉగ్రవాద సంస్థకు చెందిన భూగర్భ స్థావరాలపై అత్యంత శక్తిమంతమైన 'బంకర్ బస్టర్' బాంబులతో విరుచుకుపడినట్లు ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. ఈ చర్యతో ప్రాంతీయంగా

వివరాలు 2లో..



## ఇరాన్ పై దాడులను హిరోషిమా అణు దాడులతో పోల్చిన ట్రంప్... జపాన్ తీవ్ర ఆగ్రహం

- ట్రంప్ వ్యాఖ్యలతో తీవ్ర దుమారం
- భగ్గుమన్న హిరోషిమా, నాగసాకి బాధితులు
- ఇది చాలా విచారకరం అన్న నాగసాకి మేయర్
- ట్రంప్ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని హిరోషిమాలో నిరసనలు



**హైదరాబాద్ పెన్ పవర్:**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయంగా తీవ్ర వివాదాన్ని రేపాయి. ఇరాన్‌పై అమెరికా ఇటీవల జరిపిన సైనిక దాడులను, రెండో ప్రపంచ యుద్ధాన్ని ముగించిన హిరోషిమా, నాగసాకి అణుబాంబు దాడులతో పోల్చడంపై జపాన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ట్రంప్ వ్యాఖ్య లపై అణుబాంబు దాడి బాధితులు, అధికారులు, ప్రజల నుంచి

వివరాలు 2లో..

## హైదరాబాద్‌లో ఐఏఎంసీకి రూ.350 కోట్ల భూకేటాయింపు రద్దు చేస్తూ హైకోర్టు సంచలన తీర్పు



**హైదరాబాద్ పెన్ పవర్:**హైదరాబాద్‌లోని అంతర్జాతీయ ఆర్బిట్రేషన్, మీడియేషన్ సెంటర్ (ఐఏఎంసీ)కు అత్యంత విలువైన ప్రాంతంలో చేసిన భూ కేటాయింపులను తెలంగాణ హైకోర్టు రద్దు చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం గతంలో జారీ చేసిన జీఓలను కొట్టివేస్తూ శుక్రవారం సంచలన తీర్పు వెలువరించింది. ఈ కేటాయింపు నిబంధనలకు విరుద్ధంగా జరిగిందని దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాలపై విచారణ జరిపిన న్యాయస్థానం ఈ నిర్ణయం తీసుకుంది.

వివరాలు 2లో..

- రాయదుర్గంలో 3.5 ఎకరాల కేటాయింపుపై జారీచేసిన జీఓల కొట్టివేత
- ప్రజాప్రయోజన వ్యాజ్యాలపై విచారణ జరిపి తుది తీర్పు వెల్లడి
- నిబంధనలకు విరుద్ధంగా కేటాయింపులు జరిగాయన్న పిటిషనర్లు
- సుమారు రూ.350 కోట్ల విలువైన భూమిపై కీలక తీర్పు
- జనవరిలో వాదనలు ముగియగా, శుక్రవారం తీర్పు వెలువరించిన ధర్మాసనం

## రేపు నిజామాబాద్‌కు కేంద్ర మంత్రి అమిత్ షా రాక



వివరాలు 2లో..

- పసుపు బోర్డు ప్రధాన కార్యాలయాన్ని ప్రారంభించనున్న కేంద్ర మంత్రి
- 29న మధ్యాహ్నం 1 గంటకు బేగంపేట విమానాశ్రయానికి రాక
- అక్కడి నుంచి నేరుగా నిజామాబాద్ పర్యటనకు పయనం
- అమిత్ షా పర్యటన కోసం భారీగా ఏర్పాట్లు చేస్తున్న బీజేపీ శ్రేణులు

## విషయం లేనందువల్లే రేవంత్ రెడ్డి బూతులు మాట్లాడుతున్నారు

- బనకచర్ల అంశాన్ని రేవంత్ పక్కన పెడుతున్నారన్న హరీశ్
- బనకచర్లపై కేంద్రాన్ని నిలదీయాలని డిమాండ్
- ప్రభుత్వం స్పందించకపోతే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామన్న హరీశ్

**హైదరాబాద్ పెన్ పవర్:**బనకచర్ల ప్రాజెక్ట్ అంశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ (పీపీటీ) పేరుతో సీఎం కేవలం కాలయాపన చేస్తూ ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈ పీపీటీ కేవలం కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల కోసమే ఇచ్చారని, ఇది ఓ నాటకమని మండిపడ్డారు.
2016 నాటి అజెండా మినిట్స్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని హరీశ్ రావు సవాల్ విసిరారు. ఆనాటి సమావేశంలో

వివరాలు 2లో..



## ఎడిటర్ వ్యూ

# కమలం కన్ను పడిందా?

వైసీపీ అధినేత జగన్ చేస్తున్న వ్యాఖ్యలపై కూటమి పార్టీలోని రెండు పార్టీలే ఎక్కువగా స్పందిస్తున్నాయి. తెలుగుదేశం పార్టీ ఎటూ అందులో ముందుంటుంది. ఇక జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ కూడా జగన్ వ్యాఖ్యలకు గట్టిగానే కౌంటర్ ఇస్తున్నారు. కానీ మూడో మిత్రపక్షమైన భారతీయ జనతా పార్టీ మాత్రం జగన్ విషయంలో ఎందుకో మౌనంగా ఉన్నట్లు కనిపిస్తుంది. జగన్ చేసే విమర్శలను తిప్పికొట్టడానికి బీజేపీ నేతలు ఎవరూ పెద్దగా ముందుకు రావడం లేదు. రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయి నేతలు ఎవరూ జగన్ పై విమర్శలు చేయకపోవడం ఇప్పుడు ఏపీ పాలిటిక్స్ లో హాట్ టాపిక్ గా మారిందంటున్నారు. కనీసం రాష్ట్రంలో బీజేపీ లో ఉన్న జగన్ వ్యతిరేక నేతలు కూడా పెదవి విప్పడం లేదు.

**మోదీ మొదలు...**

ప్రధాని నరేంద్ర మోదీ నుంచి మొదలు పెడితే కేంద్ర మంత్రులు రాష్ట్రానికి వచ్చినా జగన్ ప్రస్తావన తేవడం లేదంటున్నారు తెలుగు తమ్ముళ్లు. గతంలో రాష్ట్రానికి వస్తే మోదీ, నిర్మాలా సీతారామన్, అమిత్ షా వంటి వారు వచ్చినప్పుడు చంద్రబాబు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా విమర్శలు చేసే వారని, కానీ నేడు కేంద్ర మంత్రులు సయితం జగన్ పేరు ప్రస్తావించకపోవడం ఎక్కడో డౌట్ కొడుతుందని అంటున్నారు. రాజధాని అమరావతి పనుల రీలాంచ్ కు వచ్చిన సందర్భంలోనూ ప్రధాని నరేంద్ర మోదీ జగన్ పేరును తన ప్రసంగంలో చోటు ఇవ్వలేదు. ఇక జగన్ కు బీజేపీలో వ్యతిరేకులు రాష్ట్రంలో చాలా మంది నేతలున్నారు. పురంద్రీశ్వరి, సుజనా చౌదరి, సీఎం రమేష్ వంటి వారు కూడా మౌనంగా ఉన్నారు.

**జగన్ పర్యటనల్లో...**

వైఎస్ జగన్ పర్యటన నేపథ్యంలో ఇటీవల పొదిలి, రెంటపాళ్ల పర్యటనల్లో అపశృతి జరిగింది. పొదిలిలో వైసీపీ కార్యకర్తలు పోలీసులపై రాళ్లు రువ్వారంటూ కేసు నమోదయింది. అలాగే రెంటపాళ్ల పర్యటనలో జగన్ వాహనం కింద పడి సింగయ్య అనే వ్యక్తి మృతి చెందినట్లు మరో కేసు నమోదయింది. అయినా సరే టీడీపీ, జనసేన నేతలు మినహాయించి బీజేపీ నేతల నుంచి రియక్షన్ పెద్దగా రాకపోవడం తెలుగుదేశం పార్టీలో చర్చనీయాంశమైంది. టీడీపీ సోషల్ మీడియాలో కూడా పలువురు సైకిల్ పార్టీ అభిమానులు ఇదే అనుమానాలను ప్రశ్నిస్తున్నారు. జగన్ పట్ల అంత సాఫ్ట్ కార్నర్ కమలం పార్టీకి ఎందుకు వచ్చిందన్న ప్రశ్నలతో అధినాయకత్వాన్ని నిలదీస్తున్నారు.

**నివేదికలు అందాయా?**

జగన్ పర్యటనలకు వస్తున్న ప్రజా స్పందనతో కేంద్ర ఇంటలిజన్స్ నివేదికలు ఏమైనా బీజేపీకి అందాయా? అన్న అనుమానాన్ని కొందరు వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర పార్టీ నుంచి ఆదేశాలు ఏమైనా వచ్చాయా? అని ప్రశ్నిస్తున్నారు. కూటమి ప్రభుత్వంపై దారుణమైన విమర్శలు చేస్తున్నప్పటికీ కమలం పార్టీ నేతలు కామ్ గా ఎందుకుంటున్నారని? ఇదేదో లోపాయికారీ ఒప్పందంలా తమకు అనిపిస్తుందని కొందరు టీడీపీ సీనియర్ నేతలు కూడా అభిప్రాయపడుతున్నారు. అదే నిజమయితే కూటమికి భవిష్యత్ లో ఇబ్బందులు ఎదురు కాక తప్పదన్న విశ్లేషణలు కూడా వెలువడుతున్నాయి. ఎన్నికలకు ముందు విమర్శలుచేసిన వారు ఇప్పుడు చేయకపోవడాన్ని చాలా మంది సోషల్ మీడియా హ్యాండిల్స్ లో గుర్తు చేస్తున్నారు.

# ఫోన్ ట్యాపింగ్ విచారణ ఏమైనా డైలీ సీరియలా?

తెలంగాణ రాజకీయాల్లో సంచలనం సృష్టిస్తున్న ఫోన్ ట్యాపింగ్ కేసుపై బీజేపీ ఎంపీ రఘునందన్ రావు కీలక వ్యాఖ్యలు చేశారు. సిట్ దర్యాప్తు ఒక డైలీ సీరియల్‌లా సాగుతోందని విమర్శించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు మధ్య లోపాయికారీ ఒప్పందం ఉందని ఆయన ఆరోపించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రంలో ఫోన్ ట్యాపింగ్ దుబ్బాక ఉపఎన్నికతోనే ప్రారంభమైందని, తాను మొదటి బాధితుడినని తెలిపారు.

"దుబ్బాక ఉపఎన్నిక సమయంలో నా ఫోన్ ట్యాపింగ్ జరిగిందని అప్పుడే డీజీపీకి ఫిర్యాదు చేశాను. కానీ ఇప్పటివరకు నా నుంచి వివరాలు తీసుకోలేదు. ఫిర్యాదు చేసిన నన్ను కాదని, సంబంధం లేని వ్యక్తులను సిట్ విచారణకు పిలుస్తోంది. మమ్మల్ని అడిగితే అన్ని ఆధారాలు ఇచ్చేవాళ్ళం కదా?" అని రఘునందన్ ప్రశ్నించారు. ఈ కేసు విచారణలో చివరికి గాడిద గుడ్డు తప్ప ఏమీ తేలదని ఆయన అన్నారు.

**కాంగ్రెస్ పాలనపై తీవ్ర విమర్శలు**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రచార ఆర్భాటాలకే పరిమితమైందని రఘునందన్ రావు విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకుండా పాలన సాగిస్తోందని మండిపడ్డారు. తనకు బెదిరింపు కాల్స్ వస్తున్నాయని ఫిర్యాదు చేస్తే నియోజకవర్గానికి వెళ్ళినప్పుడు సమాచారం ఇస్తే భద్రత కల్పిస్తామని పోలీసులు చెప్పారని ఆయన తెలిపారు.

పథకాల పేర్లు మార్చడంపై కూడా ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. జీహెచ్ఎంసీ పరిధిలోని అన్నపూర్ణ క్యాంటీన్ల పేరును 'ఇందిరమ్మ'గా మార్చడం దౌర్భాగ్యమని అన్నారు. "ఇందిరమ్మ పేరు చెబితే ఎమర్జెన్సీ గుర్తుకు వస్తుందనే కనీస ఇంగితజ్ఞానం కూడా కాంగ్రెస్ నేతలకు లేదు. మేయర్ ఇప్పటికైనా పేర్లు మార్చడంపై కాకుండా నగరంలో కుక్కల బెడద వంటి సమస్యలపై దృష్టి పెట్టాలి" అని హితవు పలికారు. ఇందిరమ్మ ఇళ్ళు కూడా అర్హులైన పేదలకు కాకుండా కాంగ్రెస్ కార్యకర్తలకే దక్కాయని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియోజకవర్గంలోనైనా అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్ళు ఇచ్చారని నిరూపించాలని సవాల్ విసిరారు.

**బీఆర్ఎస్‌పైనా విమర్శనాస్త్రాలు**

ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేత కవితపై కూడా రఘునందన్ రావు స్పందించారు. "కవిత బీసీనా? పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు బీసీలు గుర్తుకు రాలేదా? పార్టీ అధ్యక్ష పదవి, శాసనసభాపక్ష నేత పదవి బీసీలకు ఇవ్వకుండా ఇప్పుడు బీసీ ఉద్యమం చేస్తామంటే ఎలా?" అని ప్రశ్నించారు. మతపరమైన రిజర్వేషన్లు తొలగిస్తే రాజ్యాంగ సవరణకు తాము సిద్ధంగా ఉన్నామని రఘునందన్ రావు స్పష్టం చేశారు.

## మంత్రి సీతక్కపై మావోయిస్టుల ఆగ్రహం

- మొదటి పేజీ తరువాయి

తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ జీవోను అడ్డం పెట్టుకొని కుమురం భీమ్ జిల్లాలోని 339 ఆదివాసీ గ్రామాలను ఖాళీ చేయించడానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆరోపించారు. ఈ జీవో వల్ల రాష్ట్రంలోని మూడు జిల్లాలు కనుమరుగయ్యే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ శక్తులకు లబ్ధి చేకూర్చేందుకే ఈ జీవోను తీసుకొచ్చారని ప్రభుత్వంపై తీవ్రంగా విమర్శలు చేశారు.

వివాదాస్పదమైన జీవో నెం. 49ని తెలంగాణ ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని మావోయిస్టులు తమ లేఖలో డిమాండ్ చేశారు. లేనిపక్షంలో

తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించినట్లు సమాచారం. ఈ లేఖ ప్రస్తుతం ఏజెన్సీ ప్రాంతాల్లో చర్చనీయాంశంగా మారింది.

## రేపు నిజామాబాద్‌కు కేంద్ర మంత్రి అమిత్ షా రాక

నిజామాబాద్ జిల్లా రైతులు ఎప్పుడెప్పుడని ఎదురు చూస్తున్న పసుపు బోర్డు ప్రధాన కార్యాలయం ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారైంది. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా చేతుల మీదుగా ఈ కార్యాలయం ప్రారంభం కానుంది. ఈ కార్యక్రమం కోసం ఆయన ఈ నెల 29వ తేదీన నిజామాబాద్‌లో పర్యటించనున్నారు. ఈ పర్యటనకు సంబంధించి బీజేపీ వర్గాలు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నాయి.కేంద్ర మంత్రి అమిత్ షా ఈ నెల 29న మధ్యాహ్నం 1 గంటలకు హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి ఆయన నేరుగా నిజామాబాద్‌లో ఏర్పాటు చేసిన పసుపు బోర్డు ప్రధాన కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరవుతారు. జిల్లా రైతుల చిరకాల డిమాండ్‌గా ఉన్న పసుపు బోర్డు కార్యాలయాన్ని ఆయన అధికారికంగా ప్రారంభించి జాతికి అంకితం చేయనున్నారు.

## విషయం లేనందువల్లే రేవంత్ రెడ్డి బూతులు మాట్లాడుతున్నారు

- మొదటి పేజీ తరువాయి

మాజీ సీఎం కేసీఆర్ కేవలం ఇరు రాష్ట్రాలు కూర్చుని ప్రణాళికలు సిద్ధం చేసుకుందామని మాత్రమే అన్నారని గుర్తుచేశారు. తెలంగాణ ప్రయోజనాలకు విఘాతం కలిగించే ఏ ప్రతిపాదననూ ఒప్పుకునేది లేదని కేసీఆర్ ఆనాడే స్పష్టం చేశారని వివరించారు. ఈ నేపథ్యంలో, బనకచర్ల విషయంపై జరగబోయే కేంద్ర జలశక్తి సమావేశంలో తెలంగాణ ప్రభుత్వం తన వాదనలను బలంగా వినిపించాలని ఆయన డిమాండ్ చేశారు.విషయం లేనందువల్లే సీఎం రేవంత్ రెడ్డి బూతులు మాట్లాడుతున్నారని హరీశ్ రావు విమర్శించారు. "బేసిన్‌కు, బాసిన్‌కు తేడా తెలియని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి" అంటూ ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ ఒత్తిడి వల్లే ప్రభుత్వం ఎంపీలతో సమావేశం ఏర్పాటు చేసిందని అన్నారు. తమ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు బనకచర్ల కార్పొరేషన్ ఏర్పాటు కాలేదని, టెండర్లు కూడా పిలవలేదని ఆయన స్పష్టం చేశారు.

ఈ వివాదంలో బీజేపీ తీరును కూడా హరీశ్ తప్పుబట్టారు. "చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా" బీజేపీ నేతల వైఖరి ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణకు నష్టం జరగకముందే కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ జోక్యం చేసుకుని బనకచర్ల ప్రాజెక్టును ఆపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం సరైన రీతిలో స్పందించకపోతే, బనకచర్ల ప్రాజెక్టు వల్ల నష్టపోయే రైతులతో కలిసి సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని హెచ్చరించారు.

## లెబనాన్ లోని హెజ్‌బొల్లా స్థావరాలపై ఇజ్రాయెల్ భీకర దాడులు

- మొదటి పేజీ తరువాయి

తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి.

లెబనాన్‌లోని పర్వత ప్రాంతాలలో ఉన్న హెజ్‌బొల్లా భూగర్భ స్థావరాలే లక్ష్యంగా తమ వైమానిక దళం ఈ దాడులు జరిపిందని ఇజ్రాయెల్ అధికారులు తెలిపారు. ఈ దాడుల్లో హెజ్‌బొల్లాకు చెందిన కీలక ఆయుధాగారాలను ధ్వంసం చేశామని వారు వెల్లడించారు. గతేడాది నవంబర్‌లో అమెరికా మధ్యవర్తిత్వంతో ఇజ్రాయెల్, హెజ్‌బొల్లా మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి, హమాస్‌కు మద్దతుగా హెజ్‌బొల్లా దాడులు చేయడంతోనే ఈ ప్రతిదాడులకు దిగినట్లు ఇజ్రాయెల్ స్పష్టం చేసింది.

**భారీ నష్టం.. శిథిలాల కింద ప్రజలు**

ఇజ్రాయెల్ ప్రయోగించిన బంకర్ బస్టర్ బాంబుల ధాటికి అనేక భవనాలు దెబ్బతిన్నాయని, ఈ ఘటనలో పలువురు పాలస్తీనియన్లు గాయపడ్డారని లెబనాన్ వార్తా సంస్థలు నివేదించాయి. బాంబుల తీవ్రతకు కూలిన భవనాల శిథిలాల కింద మరికొందరు చిక్కుకుపోయారని, వారిని రక్షించేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయని అక్కడి అధికారులు తెలిపారు.

## హైదరాబాద్‌లో ఐఏఎంసీకి రూ.350 కోట్ల భూకేటాయింపు రద్దు చేస్తూ హైకోర్టు సంచలన తీర్పు

- మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్‌లోని శేరిలింగంపల్లి మండలం రాయదుర్గంలో గల సర్వే నెంబరు 83/1లో 3.5 ఎకరాలకు పైగా భూమిని ఐఏఎంసీకి కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఐటీ కారిడార్‌లో ఉన్న ఈ భూమి విలువ సుమారు రూ. 350 కోట్లు ఉంటుందని అంచనా. అయితే, ప్రభుత్వ భూమిని ఒక ప్రైవేట్ సంస్థకు కేటాయించడం చట్టవిరుద్ధమని న్యాయవాది కె. రఘునాథ్‌రావు, వెంకటరామ్‌రెడ్డి వేర్వేరుగా హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేశారు.జస్టిస్ కె. లక్ష్మణ్, జస్టిస్ కె. సుజనలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్లపై విచారణ చేపట్టింది. న్యాయవాది రఘునాథ్‌రావు వాదనలు వినిపిస్తూ, సుప్రీంకోర్టు తీర్పులకు విరుద్ధంగా, నిబంధనలను అతిక్రమించి ప్రభుత్వం ఈ కేటాయింపులు జరిపిందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

మరోవైపు, ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ (ఏజీ) వాదనలు వినిపించారు. హైదరాబాద్‌లో ఐఏఎంసీ ఏర్పాటు వల్ల అంతర్జాతీయ వాణిజ్య వివాదాల పరిష్కారం సులభతరం అవుతుందని తెలిపారు. న్యాయస్థానాల వెలుపల వివాదాలు పరిష్కారమవ్వాలని కోర్టులే ప్రోత్సహిస్తున్నాయని, దీనివల్ల న్యాయవ్యవస్థపై భారం కూడా తగ్గుతుందని ఆయన తెలిపారు. ఇరుపక్షాల వాదనలు ఈ ఏడాది జనవరిలోనే ముగియడంతో, ధర్మాసనం తీర్పును రిజర్వులో ఉంచింది. తాజాగా శుక్రవారం తుది తీర్పును వెలువరిస్తూ, ఐఏఎంసీకి భూమిని కేటాయించడంతో పాటు, దాని ప్రస్తుత భవన నిర్వహణ కోసం జారీ చేసిన జీఓలను సైతం పూర్తిగా కొట్టివేస్తున్నట్లు స్పష్టం చేసింది. ఈ తీర్పుతో ఐఏఎంసీకి రాష్ట్ర ప్రభుత్వం చేసిన భూకేటాయింపులు రద్దయ్యాయి.

## ఇరాన్ పై దాడులను హిరోషిమా అణు దాడులతో పోల్చిన ట్రంప్... జపాన్ తీవ్ర ఆగ్రహం

- మొదటి పేజీ తరువాయి

తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

**అసలేం జరిగింది?**

ట్రంప్ విలేకరులతో మాట్లాడుతూ, ఇరాన్‌పై జరిపిన దాడుల గురించి ప్రస్తావించారు. అమెరికా నిఘా వర్గాలు అంచనా వేసినట్లుగా ఇరాన్ అణు కార్యక్రమం కేవలం కొన్ని నెలలు మాత్రమే వెనక్కి వెళ్లలేదని, దశాబ్దాల పాటు కోలుకోలేనంతగా దెబ్బతీశామని ఆయన వాదించారు. ఈ క్రమంలో, "ఆ దాడితో యుద్ధం ముగిసింది. నేను హిరోషిమా, నాగసాకి ఉదాహరణలు వాడాలనుకోవడం లేదు, కానీ ఇరాన్ పై దాడి కూడా దాదాపు అలాంటిదే" అని ట్రంప్ వ్యాఖ్యానించారు.

**భగ్గుమన్న జపాన్**

ట్రంప్ చేసిన ఈ పోలికపై జపాన్‌లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ప్రపంచంలో అణుదాడికి గురైన ఏకైక దేశంగా జపాన్ ఈ వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణించింది. 1945 ఆగస్టులో జరిగిన ఈ దాడుల్లో సుమారు 1,40,000 మంది ప్రాణాలు కోల్పోగా, లక్షలాది మంది ఇప్పటికీ ఆనాటి గాయాల తాలూకు ఆరోగ్య సమస్యలతో జీవిస్తున్నారు. ఈ వ్యాఖ్యలపై నాగసాకి నగర మేయర్ షిరో సుజుకి స్పందిస్తూ, "ట్రంప్ వ్యాఖ్యలు అణుబాంబు దాడిని సమర్థించేలా ఉన్నాయి. బాంబు దాడికి గురైన నగరం తరపున ఇది మాకు చాలా విచారకరం" అని అన్నారు. నోబెల్ శాంతి బహుమతి గ్రహీత, అణుబాధితుల హక్కుల సంస్థ 'నిహాన్ హిడాంక్యో' సహ-అధ్యక్షుడు మిమాకి తోషియుకి కూడా ట్రంప్ మాటలను తీవ్రంగా విమర్శించారు. ఈ వ్యాఖ్యలు అంగీకారయోగ్యం కాదని ఆయన పేర్కొన్నారు. ఇదే సంస్థకు చెందిన మరో బాధితురాలు టెరుకో యోకోయామా మాట్లాడుతూ, నాకు తీవ్రమైన ఆగ్రహం కలుగుతోంది అని వ్యాఖ్యానించారు.

**నిరసనలు, తీర్మానాలు**

ట్రంప్ తన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం నాడు హిరోషిమాలో బాధితులు, పౌరులు నిరసన ప్రదర్శన చేపట్టారు. మరోవైపు, హిరోషిమా చట్టసభ సభ్యులు అణ్వాయుధాల వినియోగాన్ని సమర్థించే ఎలాంటి ప్రకటననైనా తిరస్కరిస్తున్నట్లు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. అన్ని సాయుధ ఘర్షణలను శాంతియుతంగానే పరిష్కరించుకోవాలని వారు పిలుపునిచ్చారు.ఈ విషయంపై జపాన్ ప్రభుత్వం అధికారికంగా ఫిర్యాదు చేస్తుందా అని ప్రశ్నించగా, జపాన్ చీఫ్ క్యాబినెట్ సెక్రటరీ హయాషి యోషిమాస స్పందిస్తూ.. "అణుబాంబుల విషయంలో మా వైఖరిని వాషింగ్టన్‌కు పదేపదే స్పష్టం చేశాం" అని తెలిపారు. ట్రంప్ వ్యాఖ్యలు అమెరికా-జపాన్ సంబంధాలలో ఉన్న సున్నితమైన చారిత్రక అంశాన్ని మరోసారి చర్చకు తీసుకువచ్చాయి.

## హైదరాబాద్‌లో మరో ఫ్లైఓవర్.. ప్రారంభానికి ముందే కేటీఆర్ ఆసక్తికర ట్వీట్

- మొదటి పేజీ తరువాయి

అందుబాటులోకి రానుంది. గచ్చిబౌలి నుంచి కొండాపూర్ వరకు నిర్మించిన ఈ మల్టీ లెవెల్ ఫ్లైఓవర్‌ను శనివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. అయితే ఈ ప్రారంభోత్సవానికి ఒక రోజు ముందు, ఈ ప్రాజెక్టుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. ఫ్లైఓవర్ నిర్మాణం క్రెడిట్ తమ ప్రభుత్వానిదేనని స్పష్టం చేస్తూనే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

**పీజేఆర్ ఫ్లైఓవర్‌గా నామకరణం**

శనివారం ఉదయం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించనున్న ఈ ఫ్లైఓవర్‌కు, దివంగత కాంగ్రెస్ సీనియర్ నేత పి. జనార్ధన్ రెడ్డి గౌరవార్థం "పీజేఆర్ ఫ్లైఓవర్"గా నామకరణం చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ ఫ్లైఓవర్ అందుబాటులోకి వస్తే గచ్చిబౌలి, కొండాపూర్, మాదాపూర్ వంటి ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

**ఇది మా ప్రభుత్వ ఘనత: కేటీఆర్**

ఈ ఫ్లైఓవర్ ప్రారంభంపై కేటీఆర్ తన 'ఎక్స్' ఖాతా ద్వారా స్పందించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి కార్యక్రమం (ఎస్ఆర్డీపీ) కింద నిర్మించిన మరో కీలక ప్రాజెక్టు అందుబాటులోకి రావడం గర్వంగా, సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్ పౌరుల తరఫున మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు తెలిపారు.

తమ పదేళ్ల పాలనలో హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు 42 ఫ్లైఓవర్లకు ప్రణాళికలు రూపొందించామని, వాటిలో 36 ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చామని కేటీఆర్ గుర్తుచేశారు. మరో 6 ప్రాజెక్టులు 2024 నాటికి పూర్తి కావాల్సిందని అన్నారు. ఈ సందర్భంగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై సెటైర్లు వేశారు. "మిగిలిన ప్రాజెక్టులను కాంగ్రెస్ ప్రభుత్వం వారి పాలనాకాలం పూర్తయ్యేలోపు అయినా పూర్తి చేయాలని కోరుకుంటున్నాను" అంటూ ఎద్దేవా చేశారు.

## తిరుమల కల్తీ లడ్డూ కేసు... సుప్రీంకోర్టుకు సిట్ నివేదిక

- మొదటి పేజీ తరువాయి

న్యాయస్థానానికి సమర్పించింది. దర్యాప్తులో వెలుగుచూసిన కీలక అంశాలతో కూడిన ఈ నివేదికను రెండు రోజుల క్రితం సీల్డ్ కవర్‌లో సుప్రీంకోర్టుకు అందజేసింది.

ఈ కేసు దర్యాప్తులో ఇప్పటివరకు సాధించిన పురోగతిని, నిందితులు వివిధ న్యాయస్థానాలలో దాఖలు చేసిన పిటిషన్ల వివరాలను సిట్ తన నివేదికలో సమగ్రంగా పొందుపరిచినట్లు తెలుస్తోంది. కేసు విచారణ సజావుగా సాగకుండా నిందితులు సృష్టిస్తున్న అడ్డంకుల గురించి కూడా న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లినట్టు సమాచారం. దర్యాప్తు ప్రక్రియను అడ్డుకునేందుకు నిందితులు ప్రయత్నిస్తున్నారని సిట్ తన నివేదికలో పేర్కొన్నట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి.

అంతేకాకుండా, ఈ కేసులో మరిన్ని తీవ్రమైన ఆరోపణలను కూడా సిట్ తన నివేదికలో ప్రస్తావించినట్లు తెలుస్తోంది. నిందితులు సాక్షులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, వారిని బెదిరింపులకు పాల్పడుతున్నారని సిట్ పేర్కొన్నట్లు సమాచారం. ఈ అంశాలను తీవ్రంగా పరిగణించిన దర్యాప్తు బృందం, వాటిని నివేదికలో పొందుపరిచి సుప్రీంకోర్టుకు తెలియజేసింది. సిట్ నివేదికతో ఈ కేసు విచారణ మరింత వేగవంతం అయ్యే అవకాశం ఉందని న్యాయ నిపుణులు భావిస్తున్నారు.

# వైసీపీ బలోపేతమే లక్ష్యం

- 42వ వార్డు వైయస్సార్సీపి అధ్యక్ష పదవిపై హర్షం
- వాసుపల్లినీ మర్యాద పూర్వకంగా కలిసిన బీశెట్టి ప్రసాద్



**విశాఖ దక్షిణం,పెన్ పవర్, జూన్ 27 :**దక్షిణలో వైఎస్ఆర్సిపి బలోపేతమే లక్ష్యంగా పని చేస్తామని 42వ వార్డు నూతన వైఎస్ఆర్సిపి అధ్యక్షుడు బీసెట్టి ప్రసాద్ అన్నారు. ఆసీలమెట్ట కార్యాలయంలో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ని బీశెట్టి ప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిశారు. సాలు వా కప్పి భారీ గజమాలతో సత్కరించారు. వాసుపల్లి గణేష్ కుమార్ అందించిన సహకా రంతో పార్టీ అధిష్టానం ఇచ్చిన ఈ పదవిని సద్వినియోగం చేసుకొని వైఎస్ఆర్సిపి పార్టీ బలోపేతమే లక్ష్యంగా ప్రజల పక్షాన పోరాడు తామని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ దక్షిణంలో 42వ వార్డు అధ్యక్షుడిగా నియమితులైన బీశెట్టి ప్రసాద్ కు అభినందనలు తెలియజేస్తూ మరింత ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో చేసిన అరాచక పాలనకు ప్రజలు పూర్తిగా వ్యతిరేకిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సంచలనాత్మక నిర్ణయాలు, చరిత్రలో నిలిచిపోయే పథకాలు ప్రవేశపెట్టి పేదలను ఆదుకున్నారని గుర్తు చేశారు. విద్యా ఉపాధి వైద్యం కు పెద్దపీట వేస్తూ రైతు సంక్షేమానికి పెద్దన్నలా నిలిచిన జగన్మోహన్ రెడ్డి నీ మళ్లీ ప్రజలు కోరుకుంటున్నారని వాసుపల్లి తెలిపారు. కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ద్వంద వైఖరిని ఎండగడతామన్నారు. పథకాలు పేరుతో ప్రజలను వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఇప్పటికైనా తీరు మార్చుకోకపోతే ప్రజల తగిన గుణపాఠం చెబుతారని వాసుపల్లి హెచ్చరించారు. యువత రైతు మహిళలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలన్నింటినీ అర్హులందరికీ అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దక్షిణ కార్పొరేటర్లు వార్డు అధ్యక్షులు, వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకు లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఈవీఎం గోదాముల వద్ద సిబ్బంది అనుక్షణం అప్రమత్తంగా ఉండాలి

- రాజకీయ పార్టీల నేతల సమక్షంలో ఈవీఎం గోదాములను తనిఖీ చేసిన డి ఆర్వో వై. సత్యన్నారాయణ రావు





**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ అనకాపల్లి, జూన్ 27 :** ఈవీఎం గోదాముల వద్ద సిబ్బంది అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని జిల్లా రెవెన్యూ అధికా రి వై. సత్యన్నారాయణ రావు ఆదేశించారు. త్రైమాసిక తనిఖీలో భాగంగా గురువారం ఉద యం జిల్లా ఎస్.పి. కార్యాలయం ప్రాంగణంలో ఉన్న ఈవీఎం గోదాములను అనకాపల్లి ఆర్డీవో షేక్ అయిషా, వివిధ రాజకీయ పార్టీల నేతలతో కలిసి తనిఖీ చేసిన ఆర్డీఓ అక్కడ పరిస్థితులను పరిశీలించి సీసీ కెమెరాల పనితీరును, ప్రధాన ద్వారానికి ఉన్న సీళ్లను పరిశీలించారు. తాళాలు తీయించి గోదాముల లోపల ఉన్న ఈవిఎం లను, అగ్నిమాపక పరికరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. భద్రతా ప్రమాణాలపై అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. భద్రతా ప్రమాణాలు, లాగ్ బుక్ నిర్వహణ ఇతర అంశాలపై రాజకీయ పార్టీల నేతలతో ఆర్డీఓ మాట్లాడారు. పార్లమెంటు, అసెంబ్లీల వారీగా భద్రపరిచిన ఈవీఎంల స్థితిగతులను ఆర్డీఓ కు ఎన్నికల విభాగం అధికారులు ఆర్డీఓ కు వివరించారు.

ఈ కార్యకమంలో అనకాపల్లి రెవిన్యూ డివిజినల్ అధికారి షేక్ అయిష, జిల్లా అగ్నిమపాక శాఖ అధికారి ఆర్. వెంకటరమణ, జిల్లా ఎన్నికల విభాగం, సూపరింటెండెంటు ఎస్.ఎస్.వి. నాయుడు, తెలుగుదేశం, బి.జె.పి, వైసీపీ, ఆప్ పార్టీ, సి.పి.ఎం పార్టీల ప్రతినిధిలు బి. శ్రీనివాసరావు, వి.రమేష్, జె.రమేష్, కె.హరినాధబాబు, ఆర్ శంకర రావు, విద్యుత్ శాఖల అధికారులు, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జగన్నాధ స్వామి రదయాత్ర



**బిమిలి, పెన్ పవర్, జూన్ 27 :**బక్కన్నపాలెం సి ఆర్ పి ఎఫ్ 234వ బేటాలియ న్ లో ఉన్న జగన్నాధ స్వామి రదయాత్ర శుక్రవారం ఉదయం చాలా ఘనంగా నిర్వహించారు. బేటాలియన్ ప్రాంతం నుండి బక్కన్నపాలెం మీదుగా పీఎంపాలెం పరిసర ప్రాంతాలలో స్వామి వారి రథాన్ని ఉత్సవంలా ఊరేగించారు. స్వామి రథయాత్ర ఊరేగింపులో పలు సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తి పాటలకు కోలాటం బృందాలు, భజన బృందాలు నిర్వహించిన నృత్యాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా మధురవాడ కి చెందిన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి కోలాటం బృందం సభ్యులు చేసిన కోలాట నృత్యం చూపరులను ఎంతగానో అక్కటుకున్నాయి. జగన్నాధ స్వామి వారి రదయాత్రలో ఆ ప్రాంత భక్తులు భారీగా పాల్గొని గీతాలాపన చేస్తూ, జై జగన్నాధ్ స్వామి అంటూ నినాదాలు చేస్తూ స్వామి రథాన్ని లాగారు. ఈ రదయాత్ర శుక్రవారం నుండి మొదలుకొని 11రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు బేటాలియన్ లో జగన్నాధ్ స్వామి దేవాలయ నిర్వాహకులు తెలిపారు. జగన్నాధ్ స్వామి వారి రథయాత్రలో స్వామి వారి సేవలో భాగంగా కోలాటం నృత్య ప్రదర్శనకు అవకాశం ఇచ్చిన 234బేటాలియన్ సభ్యులకు శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి కోలాటం బృందం సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## గొలుగొండ పేటలో ఎంపీడీవో విచారణ....




**నాతవరం,పెన్ పవర్ (జూన్ 27):** మండలంలో గల గొలుగొండపేట లో శుక్రవారం స్థానిక మండల అభివృద్ధి అధికారి ఉషాశ్రీ స్థానిక నాయకులు పైల సూర్యనారాయణమూర్తి ఉపాధి పనుల్లో దొంగ మస్తులు వేస్తున్నారని జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేయడంతో ఆమె గ్రామ సచివాలయం వద్ద ఉపాధి కూలీలు,మేట్లు సమక్షంలో విచారణ చేశారు.అయితే మరో రోజు ఫీల్డ్ కు వెళ్లి స్వయంగా పరిశీలించి దొంగ మస్తార్లు వేస్తున్నది లేనిది పరిశీలిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో ఏపీఓ కొండా జి, టెక్నికల్ అసిస్టెంట్ ప్రసాద్, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

## విశాఖ వ్యాలీ స్కూల్‌లో యంగ్ ఇండియన్స్ పార్లమెంట్ 2.0






- దేశ నిర్మాణంలో యువత పాత్ర కీలకం విశాఖ ఎం.పీ భరత్

**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, విశాఖపట్నం, జూన్ 27 :**దేశ నిర్మాణంలో యువత పాత్ర అత్యంత కీలకమని విశాఖ ఎంపీ భరత్ అన్నారు. సీఐఐ యువ విభాగమైన యంగ్ ఇండియన్స్ (వైఐ) ఆధ్వర్యంలో శుక్రవారం నాడు విశాఖ వ్యాలీ స్కూల్‌లో యంగ్ ఇండియన్స్ పార్లమెంట్ 2.0 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీ భరత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చదువుకున్న యువత రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఇప్పుడు మరింత ఉందన్నారు. యువ పార్లమెంటేరియన్లను ఉత్తేజపరిచేలా తన అనుభవాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర ప్రాంతంలోని 100కిపైగా ప్రతిభావంతుల్కైన పాఠశాల విద్యార్థులు పాల్గొని, భారత పార్లమెంటరీ వ్యవస్థపై విలువైన అనుభవాన్ని పొందారు. వాస్తవిక చర్చలు, వాదనలు, శాసన ప్రక్రియల అనుకరణ ద్వారా విద్యార్థులు పార్ల మెంటు సభ్యులుగా పాల్గొని, శాసన వ్యవస్థ ఎలా పని చేస్తుందో ప్రత్యక్ష అనుభవాన్ని పొందారు. ఈ కార్యక్రమానికి డా. శ్రావణి బెల్లం యంగ్ ఇండియన్స్ - వైజాగ్ చైర్, దీప కొడాలి కో-చైర్, సుప్రియా సురపనేని థలిర్ చైర్ నాయ కత్వం వహించారు. పలువురు యంగ్ ఇండియ న్స్ సభ్యులు విద్యార్థులకు మార్గదర్శకత్వం వహించారు.

## అనారోగ్య మహిళకు వాసుపల్లి ఆపన్న హస్తం.

మెడికల్ ఖర్చులకు రూ. 5000 అందజేసిన గణేష్ కుమార్



**విశాఖ దక్షిణం, పెన్ పవర్,జూన్ 27. :**బ్రెయిన్ సమస్యతో బాధపడుతున్న మహిళకు మెడికల్ ఖర్చులకోసం మాజీ ఎమ్మెల్యే, పేదల ఆపద్బాంధవుడు దక్షిణ నియోజకవర్గ సమన్వ యకర్త వాసుపల్లి గణేష్ కుమార్ రూ.5000 ఆర్థిక సహాయం అందజేశారు. ఆసీలమెట్ట కార్యాలయంలో శుక్రవారం ఉదయం లక్ష్మీ టాకీస్ గానుగులవారి వీధి కి చెందిన రాచమల్లి లక్ష్మి కి సొంత నిధులతో రూ.5వేల నగదును అందించి ధైర్యం కల్పించారు. మెడికల్ కి సంబంధించి ఏ సహాయం చేయడానికి అయినా ముందుంటానని అనారోగ్య మహిళకు వాసుపల్లి గణేష్ కుమార్ ధైర్యం కల్పించారు. పేద ప్రజలకు ఉచితంగా అందవలసిన ఆరోగ్యశ్రీ నీ కూటమి ప్రభుత్వం నీరు కారుస్తుందని ఆగ్ర హం వ్యక్తం చేశారు. నాడు వైయస్సార్ పేదలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందిం చాలని దేశానికి ఆదర్శప్రాయంగా ఆరోగ్య శ్రీ ని ప్రవేశ పెట్టారన్నారు. ఆయన తనయుడు ప్రజల గుండెచప్పుడును దగ్గరగా విన్న జగన్మోహన్ రెడ్డి ఆరోగ్యశ్రీనీ మరింత విస్తరించి పేదలకు అందించారని వాసుపల్లి గుర్తు చేశారు. కానీ చంద్రబాబు వెన్నుపోటు రాజకీయాలు చేసి ప్రజా వ్యవస్థను భ్రష్టు పట్టించాడని వ్యతిరేకిం చారు. విద్య వైద్యం అందించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వాసుపల్లి ఆగ్రహం వ్యక్తం చేశారు. సంక్షేమం, అభివృద్ధి పొందడం ప్రజా హక్కుని, అటువంటి హక్కును ఇచ్చిన భారత రాజ్యాంగాన్ని, డాక్టర్ బాబాసా హెబ్ ఆలోచన విధానాలను తుంగలో తొక్కు తున్న చంద్రబాబు, లోకేష్ విధివిధానాలు ప్రశ్నించలేని పవన్ కళ్యాణ్ కేవలం వాల్ పోస్టర్ కి మాత్రమే పరిమితమయ్యాడని దుయ్యబట్టారు.

ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ చెన్న జానకిరా మ్,వార్డు అధ్యక్షులు, వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నేత్ర శస్త్ర చికిత్సలు కోసం వృద్ధులు తరలింపు.





**కురుపాం, పెన్ పవర్, జూన్ -27,**జిల్లా కలెక్టర్ మరియు జిల్లా అంధత్వ నివారణ సంస్థ చైర్మన్ శ్యామ్ ప్రసాద్ వారి ఆదేశాలమేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా భాస్కరరావు గారి పర్యవేక్షణ లో జిల్లాలో నిర్వహించిన ప్రత్యేక కంటి వెలుగు కార్య క్రమం లో బాగంగా గుమ్మలక్ష్మీపురం,కురుపాం మండలంలో వున్న సచివాలయంల పరిధిలో వున్న గ్రామాలలో నిర్వహించిన నేత్ర వైద్య శిభిరం లలో చేసిన నేత్ర పరీక్షలలో కేటరాక్ట్(అంతర కుసుమం) టేరిజియం(కొయ్యకండ) వున్న వారిని గుర్తించి వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు కోసం ఈ రోజు కురుపాం సామజిక ఆరోగ్య కేంద్రం నుండి పుష్ప గిరి కంటి ఆసుపత్రి విజయ నగరం కి తరలించి రేపు శస్త్ర చికిత్సలు నిర్వహిస్తామని మన్యం జిల్లా అంధత్వ నివారణ సంస్థ నేత్ర వైద్య అధికారి జీరు నగేష్ రెడ్డి తెలిపారు.వీరందరికీ ఉచిత రవాణా,వసతి, భోజనం, కళ్ళ జొల్లు,మందులు సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. శస్త్ర చికిత్సలు కు వెళుతున్న రోగులకు పలు సూచనలు,జాగ్రతలు వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా మా లాంటి పేదలకు కంటి చూపును తెప్పించే బాధ్యత జిల్లా కలెక్టర్ మరియు చైర్మన్ గారు తీసుకొని అన్ని సదుపాయాలు కల్పిస్తున్న జిల్లా అంధత్వ నివారణ సంస్థ కి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్య క్రమంలో ఆరోగ్యమిత్రమరియు ఆషా కార్య కర్తలు పాల్గొన్నారు.

## విశాఖ ప్రజలంటే సిఎం చంద్ర బాబు కి అత్యంత ప్రేమ

- భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కామెంట్స్



**భీమిలి, పెన్ పవర్, జూన్ 27 :**విశాఖ ప్రాంతంలో ఉన్న ప్రజలంటే సిఎం చంద్ర బాబు కి అత్యంత ప్రేమ విద్యుత్ పై స్పెషల్ ఫోకస్ పెట్టాలని సిఎస్ ను కోరుతున్నా హైద్రా బాద్ లో గచ్చిబౌలి తర్వాత విశాఖ రెడీ అవ్వ నుంది భీమిలి ప్రాంతానికి టీసీఎస్, గూగుల్ ఇలా అనేక ఐటీ కంపెనీలు రానున్నాయి హౌసింగ్ పై కూడా ప్రత్యేక దృష్టి పెట్టనున్నాం భవిష్యత్తు లో యూనిట్ ఛార్జి మరింత తగ్గొచ్చు ఇలాంటి భవనం మా భీమిలి ప్రాంతంలో ఉండటం చాలా అదృష్టం సిఎస్ విజయానంద్ కామెంట్స్ భవన నిర్మాణం సమయం లోనే ప్రమాణాలతో కూడిన పద్ధతిలో నిర్మించుకుంటే విద్యుత్ ను ఆదా చేసే అవకా శం ఉంటుంది రాష్ట్రం లో 24 గంటలు నాణ్య మైన విద్యుత్ అందించాలని సిఎం చంద్రబాబు ఆదేశాలు ఇచ్చారు మంత్రి గొట్టిపాటి రవికుమార్ కామెంట్స్ సుమారు 14 కోట్లతో శుక్రవారం ప్రారంభించడం చాలా ఆనం దంగా ఉంది 50 మెగా వాట్స్ తో సోలార్ కూడిన పద్ధతిలో భవన నిర్మాణం చేయడం జరిగింది దేశ వ్యాప్తంగా ఇక్కడ నుంచే సేవలు ఉపయోగపడే విధంగా కృషి చేయాలి నియోజకవర్గంలో 10 వేలు నూతన కనెక్షన్లు ఇచ్చే విధంగా కృషి చేస్తున్నాం రైతులకు పగటి వేల సోలార్ ద్వారా 9 గంటలు విద్యుత్ ఇచ్చే విధంగా ప్రణాళికలు వేస్తున్నాం ఇదే వేదిక ద్వారా 20 మందికి ఉద్యోగాలు కల్పిస్తున్నాం ఒక్క కేసు కూడా పెండింగ్ లేకుండా యుద్ధప్రా తిపదికన కారుణ్య నియామకాలు చేపడు తున్నాం అన్ని గిరిజన ప్రాంతాల్లో 120 కోట్లతో విద్యుత్ అందించడమే లక్ష్యం యూనిట్ చార్జీ లు పెంచకుండా రానున్న రోజుల్లో తగ్గించమే సిఎం చంద్రబాబు లక్ష్యం

## పారిశుద్ధ్య పనులను పరిశీలించిన ఎంపీడీవో



**కొయ్యూరు, పెన్ పవర్ జూన్ 27:** శుక్రవారం మండలంలోని నడింపాలెం గ్రామంలో జరుగుతున్న ప్రత్యేకపారిశుద్ధ్య పనులను కొయ్యూరు ఎంపీడీవో జివి డి ప్రసాదరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ప్రసాదరావు మాట్లాడుతూ... ప్రస్తుతం వర్షాలు పడుతున్న నేపథ్యంలో గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపడుతున్నామని ఈ సందర్భంగా తెలిపారు. గ్రామస్తులతో మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎప్పటికప్పుడు చెత్త చెదారం లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. చెత్తను రోడ్లపై వెయ్యొద్దని ఈ సందర్భంగా సూచించారు. ఆయన వెంట ఈవోపీఆర్డి నాయుడు, పంచాయితీ కార్యదర్శి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రానికి తరలివస్తున్న పరిశ్రమలు - ప్రభుత్వ అనుమతులు

హైదరాబాద్ పెన్ పవర్: రాష్ట్రంలో మరో మూడు పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయి. ఈ మేరకు ప్రభుత్వం వాటికి అనుమతులు మంజూరు చేస్తూ ఉత్తర్వులిచ్చింది. అనంతపురం జిల్లా గిన్‌ఫ్రా ప్రెసిషన్స్ సంస్థ తిమ్మసముద్రంలో పరిశ్రమను ఏర్పాటు చేయనుంది. ఇందులో భాగంగా రూ.1150 కోట్లతో 155ఎంఎం ఆర్టిలరీ గన్‌ల కోసం బైమాడ్యులర్ ఛార్జ్ సిస్టమ్స్ తయారీ యూనిట్?ను నెలకొల్పనుంది. కంపెనీ ఏర్పాటు కోసం ఎకరం రూ.8.30 లక్షల చొప్పున 121.53 ఎకరాలు కేటాయిస్తూ సర్కార్ ఆదేశాలిచ్చింది. భూమి స్వాధీనం చేసుకున్న 14 నెలల్లో ఉత్పత్తి చేపట్టాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. పరిశ్రమ ఏర్పాటుతో 299 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. అదేవిధంగా ట్రిపుల్ బేస్ ప్రొపెల్లెంట్ , సింగిల్ బేస్ ప్రొపెల్లెంట్ యూనిట్‌లను ఈ సంస్థ అదనంగా నెలకొల్పనుంది. మరోవైపు నెల్లూరు జిల్లా నాయుడుపేటలో పరిశ్రమ ఏర్పాటుకు సంగం సంస్థకు ప్రభుత్వం అనుమతిచ్చింది. ఈ క్రమంలో నాయుడుపేట ఎంపీసెజ్‌లో రాయితీపై భూములు కేటాయిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఇందుకోసం ఎకరం రూ.50 లక్షల చొప్పున 22.80 ఎకరాలు కేటాయించింది. రూ.112 కోట్లతో పాలు, ఉత్పత్తుల యూనిట్?ను ఆ సంస్థ నెలకొల్పనుంది. తద్వారా 400 మందికి ఉపాధి లభించనుంది.

తిరుపతి జిల్లాలో సౌర పరిశ్రమ ఏర్పాటుకు కృష్ణపట్నం పవర్ కార్పొరేషన్‌కు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. గతంలో పారిశ్రామిక పార్కు ఏర్పాటుకు ఆ సంస్థ అనుమతులు తీసుకుంది. చిల్లకూరు మండలం తమ్మినపట్నం, మొమ్మిడిలో 350 మెగావాట్ల సోలార్, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ ప్రాజెక్టు ఏర్పాటుకు ఆదేశాలిచ్చింది. అక్కడ ఆ సంస్థ రూ.1225 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. తద్వారా 575 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించనుంది. ఏపీ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ కింద సర్కార్ రాయితీలు ప్రకటించింది. ఇందుకోసం తగు చర్యలు తీసుకోవాలని ఏపీఐఐసీ, పరిశ్రమలశాఖ అధికారులను ఆదేశించింది. ఈ మేరకు పరిశ్రమలు, వాణిజ్యశాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్ ఉత్తర్వులు జారీ చేశారు.

# మీ మాట వింటుంది - సలహా ఇస్తుంది - 'సైబర్ కమాండో'



హైదరాబాద్ పెన్ పవర్: 'సార్ నా ఫోన్? పోయింది. ఏం చేయాలి?' 'అయ్యా మా అబ్బాయిని డిజిటల్ అరెస్టు చేస్తామంటున్నారు. డబ్బులు ఇవ్వమని బెదిరిస్తున్నారు?' ఇలాంటివి ఏ అర్ధరాత్రి సమయంలో జరిగితే పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయాలంటే ఎవరికైనా కష్టమే కదా. ఒక మారుమూల పల్లె నుంచి నగరానికి వచ్చి ఫిర్యాదు చేయాలంటే ఎంతైనా ఇబ్బందికరమే. ఇలా కాకుండా ఒక ఫోన్? నంబరుకు కాల్? చేస్తే మీకు కావాల్సిన సలహా క్షణాల్లో ఇచ్చి, ఏం చేయాలో చెబితే అద్భుతంగా ఉంటుంది కదూ ఎన్టీఆర్ జిల్లా పోలీసులు అదే చేశారు. నిజమండీ ఈ దిశగా మరో కొత్త సాంకేతికతను తీసుకొచ్చారు.

ఈ క్రమంలో మరో సరికొత్త సాంకేతిక ప్రయోగానికి నాంది పలికారు పోలీసులు. ఏఐ ఆధారంగా పని చేసే 'సైబర్ కమాండో'ను ప్రవేశపెట్టనున్నారు. ఇది అవసరమైన వారికి సూచనలు, సలహాలు ఇవ్వడమే కాకుండా మీ పేరుతో పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు పంపిస్తుంది. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర్‌బాబు దీనికి తుది రూపు ఇస్తున్నారు. ఈ నెల 28న రింగ్‌రోడ్డులోని 'వెన్యూ'లో ప్రదర్శనకు ఏర్పాట్లు చేశారు.

సురక్ష- 3600 సంబరాలు: నగరం నుంచి పల్లెల వరకు ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్‌లో మారుమూల ప్రాంతాలనూ సీసీ కెమెరాల పరిధిలోకి తెచ్చారు. వాటిని ఎన్టీఆర్ కమిషనరేట్‌లో కమాండ్ కంట్రోల్ కేంద్రానికి అనుసంధానం చేశారు. కమిషనరేట్‌లో సంపూర్ణంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం పూర్తయింది.దీన్ని 'సురక్ష 3600 ' పేరుతో వెన్యూ ఫంక్షన్ హాలులో సంబరాలు నిర్వహించనున్నారు. రెండో విడతలో ఎన్టీఆర్ కమిషనరేట్‌లో అన్ని రకాల ప్రార్థనా మందిరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. దీనికోసం మందిరాల నిర్వాహకులతో మాట్లాడారు. ఇప్పటికే చాలా వాటిలో ఏర్పాటు చేయగా వాటిని కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

**రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్?నే మోసం చేశారు - కోటి రూపాయలు కొట్టేశారు**

ఫోన్ చేస్తే చాలు: సైబర్ నేరాలు, చోరీలపై ఫిర్యాదు, డిజిటల్ అరెస్టు పేరుతో బెదిరింపు కాల్స్ వస్తే ఫిర్యాదుదారులు ఫోన్ చేసేందుకు ఒక నంబరు ఇస్తారు. ఆ నంబరుకు ఫోన్ చేస్తే ఏఐతో పనిచేసే 'సైబర్ కమాండో'కు వెళుతుంది. అది మీ మాటలు విని దానికి సంబంధించిన సూచనలు సలహాలు చేస్తుంది. మీ సందేహాలన్నింటినీ నివృత్తి చేస్తుంది. డిజిటల్ అరెస్టు అంటూ సైబర్ నేరగాళ్లు ఫోన్ చేస్తే ఏం చేయాలో చెబుతుంది. మీ చరవాణి పోయిందని ఫిర్యాదు చేస్తే మీ పేరుతో సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేస్తుంది. ఇవే కాదు ఇలా పోలీస్ సేవలన్నింటినీ ఏఐ ద్వారా 'సైబర్ కమాండో' అందిస్తుంది. ఇది ఎంత అధునాతనమైందంటే ఒక సారి మీరు ఫోన్ చేసి మాట్లాడితే, ఆ తర్వాత ఎపుడైనా మళ్లీ ఫోన్ చేస్తే మిమ్మల్ని గుర్తుపట్టి మీ పేరుతో పిలిస్తుంది. ఇలాంటి ఏఐ ఆధారిత పోలీస్ సేవలకు ఈ నెల 28న శ్రీకారం చుడతారు. తర్వాత మరింత కసరత్తు చేసి పూర్తి స్థాయిలో ఎన్ని రకాల సేవలు ఎలా అందించగలమో నిర్ణయిస్తారు.

# దొరికేవన్నీ సేంద్రియం కాదు - జాగ్రత్తగా ఉండాలంటున్న నిపుణులు



హైదరాబాద్ పెన్ పవర్: నగర జీవనంలో నానాటికి పెరిగిపోతున్న రుగ్మతలకు క్రమ పద్ధతిలో లేని జీవన అలవాట్లతో పాటు రసాయన మిళితమైన ఆహార పదార్థాలే కారణమన్నది కాదనలేని సత్యం. ఆ క్రమంలోనే సేంద్రియ ఆహార పదార్థాల (ఆర్గానిక్ ఫుడ్స్)కు నెల్లూరు నగరంతో పాటు ఇతర పట్టణాల్లో గిరాకీ పెరిగింది. ఇంత వరకు బాగానే ఉన్నా సేంద్రియం పేరుతో సాధారణ రకాలను అంటగడుతున్నారనే విమర్శలు ఆందోళన కలిగిస్తుండగా ప్రకృతి వ్యవసాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నా నెల్లూరు జిల్లాలో ఆశించిన ఫలితాలు కనిపించడం లేదన్న అసంతృప్తి నెలకొంది.

జాగ్రత్తలు పాటించి కొనడం తప్పనిసరి: వైద్యులు సైతం మధుమేహం, అల్సర్లు, ఇతర అనారోగ్య పరిస్థితులను అధిగమించేందుకు సేంద్రియ ఉత్పత్తులు, ఆహారాన్ని వినియోగించాలని సూచిస్తుండటంతో ఏటా వినియోగదారుల సంఖ్య పెరుగుతోంది. దాంతో విక్రయ దుకాణాలు పెరుగుతున్నాయి. నెల్లూరు నగరంలో విక్రయిస్తున్న దుకాణాల్లో ఎక్కువగా తెలంగాణ, తమిళనాడుతో పాటు రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల వ్యవసాయ క్షేత్రాల నుంచి దిగుమతి చేసుకున్న సేంద్రియ ఉత్పత్తులే ఉంటున్నాయి. అదే సమయంలో దొరికేవన్నీ సేంద్రియం కాదనే విషయాన్ని గమనించాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. దీర్ఘకాలం నుంచి వినియోగించే వారిలో అసలు, నకిలీని గుర్తించే నేర్పు ఉంటుందని, కొత్తవారు కొంచెం జాగ్రత్తలు పాటించి కొనుగోలు చేయాలని సూచిస్తున్నారు.

**అరకు ఆర్గానిక్ కాఫీ - కొనుగోలుకు టాటా గ్రూప్ ఆసక్తి**

వర్షాలు పడే నాటికి వేయి ఎకరాల్లో సాగు: వచ్చే అయిదేళ్లలో జిల్లాలోని 102 గ్రామాల్లో 82 వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని లక్ష్యంగా నిర్ణయించగా, క్షేత్రస్థాయిలో ఆశించిన అడుగులు పడటం లేదు. ఇందుకోసం డివిజన్, మండల, గ్రామస్థాయిలో సుమారు 500 మంది సిబ్బందిని నియమించినా రైతులకు అవగాహన కల్పించడమూ అంతంత మాత్రంగానే ఉంది. ఆంధ్రప్రదేశ్ సంఘ నిర్వాహక ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతు సాధికార సంస్థ అమలు చేస్తున్న వ్యవసాయమూ పడకేసింది. వర్షాలు పడే నాటికి వేయి ఎకరాల్లో సాగు ప్రారంభించాలని నిర్ణయించినా ఇప్పటి వరకు 250 ఎకరాల్లో కూడా పూర్తిస్థాయిలో విత్తకపోవడం గమనార్హం. దీనిపై జిల్లా వ్యవసాయ అధికారిణి సత్యవాణి మాట్లాడుతూ జిల్లాలో ప్రకృతి వ్యవసాయాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలకు సైతం అవగాహన కల్పిస్తున్నామన్నారు. బహిరంగ మార్కెట్‌లో విక్రయించే సేంద్రియ ఉత్పత్తులపై కొనుగోలుదారులు అవగాహనతో ఉండాలని స్పష్టం చేశారు.

# జుత్తాడలో ఆరుగురి హత్య కేసు - నిందితుడికి మరణశిక్ష



హైదరాబాద్ పెన్ పవర్: విశాఖ కోర్టు సంచలన తీర్పు వెలువరించింది.పెందుర్తి మండలం జుత్తాడలో ఆరుగురిని నరికి చంపిన అప్పలరాజుకు మరణశిక్ష విధించింది. 2021 ఏప్రిల్ 15న చిన్నారి సహా ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురిని నిందితుడు దారుణంగా హతమార్చాడు. జుత్తాడలోని బత్తిన, బొమ్మిడి కుటుంబాల మధ్య వివాదాలున్నాయి. ఈ నేపథ్యంలో బొమ్మిడి కుటుంబం ఇంట్లోకి చొరబడిన అప్పలరాజు ఆరుగురిపై కత్తితో దాడి చేశాడు. దొరికిన వారిని దొరికినట్టు నరికేశాడు.అప్పలరాజు కత్తితో విచక్షణారహితంగా దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిన బొమ్మిడి రమణ (63), ఉషారాణి (35), అల్లూరి రమాదేవి (53), నక్కెళ్ల అరుణ (37), బొమ్మిడి ఉదయ్ (2), ఉర్విష (6 నెలలు) ఘటనా స్థలంలోనే అక్కడికక్కడే మృతి చెందారు. అనంతరం నిందితుడు పోలీస్ స్టేషన్?లో లొంగిపోయాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఇందులో భాగంగా కోర్టుకు సాక్ష్యాధారాలు సమర్పించారు. దీనిపై ఇవాళ విచారణ జరిపిన విశాఖ కోర్టు అప్పలరాజుకు మరణ శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది.అసలేం జరిగిదంటే : జుత్తాడకు చెందిన బొమ్మిడి విజయ్ కిరణ్ భార్య, ముగ్గురు పిల్లలతో విజయవాడలో నివసిస్తున్నాడు. తన కుమార్తెపై విజయ్ అత్యాచారం చేశాడని నిందితుడు బత్తిన అప్పలరాజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ నేపథ్యంలో 2018లో పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటినుంచీ ఇరు కుటుంబాల మధ్య కేసులు, గొడవలు చోటు చేసుకున్నాయి. ఈ క్రమంలో విజయ్ విజయవాడలోని అత్తారింటికి మకాం మార్చాడు. మేనత్త కుటుంబం కూడా అతనితోనే కలిసి ఉంటోంది.ఉమ్మడిగా నివసించే విజయ్ కుటుంబం స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటు వేసేందుకు జుత్తాడకు వచ్చారు. విహహ కార్యక్రమం ఉన్నందున షాపింగ్ చేసి విజయవాడ వెళ్లాలని భావించారు. తన కుమార్తె జీవితం నాశనం చేసిన విజయ్ ఒక్కడినే చంపేస్తే క్షణంలో తేలిపోతుందని కుటుంబాన్నే హతమారిస్తే అతడు జీవితాంతం కుమిలి, కృశించి పోతాడని అప్పలరాజు ప్లాన్ చేశాడు. ఈ క్రమంలో నిందితుడు ఇంట్లోకి చొరబడి వారిపై కత్తితో విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో విజయ్ కుటుంబ సభ్యులు ఆరుగురు మృతి చెందారు. ఘటన జరిగిన సమయంలో విజయ్ పెద్ద కుమారుడు అఖిల్ బంధువుల ఇంట్లో నిద్రపోవడం వల్ల ప్రాణాలతో బయటపడ్డాడు.

# తిరుమల ఘాట్ రోడ్డులో తారు పనులు - రెండు నెలల్లో పూర్తి



హైదరాబాద్ పెన్ పవర్: ఘాట్ రోడ్ల పటిష్ఠతకు తిరుమల తిరుపతి దేనస్థానం శ్రీకారం చుట్టింది. వర్షాలకు తరచూ గుంతలు పడుతుండటంతో పూర్తిస్థాయి పనులకు శ్రీకారం చుట్టింది. తిరుమలకు వచ్చే వాహనాల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ప్రస్తుతం ప్రైవేటు వాహనాలు, ఆర్టీసీ బస్సులు పది వేల వరకు రాకపోకలు సాగిస్తుండగా 800 వరకు ద్విచక్ర వాహనాలు తిరుగుతున్నాయని అధకారులు తెలిపారు. ఈ క్రమంలో కొండపైకి వెళ్లి వచ్చేందుకు రెండు ఘాట్‌రోడ్లు అందుబాటులో ఉండగా రూ.10.50 కోట్లతో బీటీ పనులు చేపట్టారు.తిరుమల నుంచి కిందకు దిగే మొదటి ఘాట్ రోడ్డు పొడవు 19 కి.మీ. ఉండగా ఈ మార్గంలో 58 మలుపులు ఉన్నాయి. వాహనాలు కిందకు దిగేందుకు కనీసం 40 నిమిషాలు తప్పనిసరిగా తీసుకోవాలి. పైకి వెళ్లే రెండో ఘాట్‌రోడ్డు 18 కి.మీ. ఉండగా 6 మలుపులు ఉన్నాయి. ఈ మార్గంలో కనీసం 28 నిమిషాల సమయం పాటించాలని టీటీడీ నిబంధనలు విధించింది.భక్తులకు ఈ జాగ్రత్తలు : బీటీ పనుల నేపథ్యంలో వాహనదారులు మరింత అప్రమత్తంగా వాహనాలు నడపాలని తిరుమల తిరుపతి దేవస్థానం విజ్ఞప్తి చేస్తోంది. భక్తులు కనీసం గంట ముందుగా తమ ప్రయాణం ప్రారంభించాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది. అత్యవసర సేవలకు టీటీడీ టోల్‌ఫ్రీ నెం.155257కు సంప్రదించవచ్చని తెలిపింది.

రెండున్నర నెలల్లో పూర్తి: తిరుమల రెండు ఘాట్‌రోడ్లలో బీటీ రోడ్డు నిర్మాణం రెండున్నర నెలలోపు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అత్యాధునిక యంత్రాలతో పనులు నిర్వహిస్తున్నామని అధికారులు తెలిపారు. అదే సమయంలో భక్తులు ఇబ్బందులు పడకుండా ఓ వైపుగా తవ్వి రోడ్డును తొలగిస్తూ మరోవైపు వాహనాలు అనుమతిస్తున్నామన్నారు. వీలైనంత తొందరగా పనులు పూర్తి చేస్తామన్నారు.

26 కంపార్టుమెంట్లలో వేచి ఉన్న భక్తులు: తిరుమలలో టోకెన్లు లేని భక్తులకు సర్వదర్శనానికి 18 గంటలు వేచి ఉండాల్సి వస్తోంది. శ్రీవారి సర్వదర్శనానికి 26 కంపార్టుమెంట్లలో భక్తులు వేచి ఉన్నారు. గురువారం 64,879 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 23,960 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. హుండీ ఆదాయం రూ.4.09 కోట్లు వచ్చిందని టీటీడీ అధికారులు వివరించారు.

# కబ్జాదారుల చేతిలో దేవాదాయ భూములు - భగవంతునికి దక్కేనా?



హైదరాబాద్ పెన్ పవర్: ఎకరం కాదు, రెండెకరాలు కాదు, వందల ఎకరాల మాన్యం భూములు ఆక్రమణలకు గురయ్యాయి. దేవాదాయ, రెవెన్యూ శాఖ అధికారుల సర్వేలో ఇది గుర్తించారు. వీటి స్వాధీనానికి కలెక్టర్ నేతృత్వంలోని జిల్లా స్థాయి కమిటీ చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే ఈ భూములపై క్రయవిక్రయాలను నిషేధించింది.

బాపట్ల జిల్లాలో దేవాదాయ శాఖకు చెందిన వందల ఎకరాలు కబ్జాదారుల చేతిలో ఉన్నాయి. బాపట్ల భావనారాయణ స్వామి ఆలయానికి చెందిన ఎకరాల కొద్దీ భూమి ఆక్రమణలకు గురైంది. వీటి విలువ రూ.కోట్లలో ఉంది. యద్లపాడు మండలం కారుచోటలలో 12 ఎకరాల మెట్ట భూమిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బాపట్ల పట్టణంలోని కొత్తపాలెం సమీపంలో 2.70 ఎకరాలు, మూలపాలెంలో 3.43 ఎకరాలు, కంకటపాలెంలో మూడున్నర ఎకరాలు చొప్పున ఆలయానికి స్వాధీన పరిచారు.

కంకటపాలెంలో మరో ఐదున్నర ఎకరాల స్వాధీనానికి చర్యలు చేపట్టారు. పట్టణంలో 6.62 ఎకరాల భూమి ఉంది. ప్రస్తుత విలువ రూ.25 కోట్లకు పైగా పలుకుతోంది. దీన్ని ఆక్రమించి పక్కా గృహాలు నిర్మించారు. బాపట్లలోనే తూర్పు సత్రానికి చెందిన 28 సెంట్ల స్థలం కబ్జారాయుళ్ల చేతిలో ఉంది. ఇక్కడ సెంటు రూ.పది లక్షలకు పైగా పలుకుతోంది. కొల్లూరు మండలంలో సోమశేఖర దేవస్థానికి చెందిన 222.89 ఎకరాలు, భట్టిప్రోలు నరేంద్రస్వామి ఆలయానికి చెందిన 62.31 ఎకరాల వరదరాజు స్వామి గుడికి చెందిన 81.42 ఎకరాల భూమి ఆక్రమణకు గురైనట్లు సర్వేలో తేలింది.

ప్రస్తుతం ఈ భూములను రైతులు సాగు చేస్తున్నారు. పర్చూరు మండలంలో అద్దంకి నాంచారమ్మ ఆలయానికి చెందిన 4.71 ఎకరాలు, చీరాల మదనగోపాలస్వామి గుడికి చెందిన 5.36 ఎకరాలు, విఠలేశ్వరస్వామి దేవాలయ భూమి 97 సెంట్లు ఆక్రమణలకు గురైనట్లు తేల్చారు. ప్రస్తుతం కబ్జాకు గురైన 384.56 ఎకరాలు ఎవరికీ విక్రయించకుండా 22-ఏలో ఉంచారు. కలెక్టర్ నేతృత్వంలోని జిల్లా స్థాయి కమిటీ భూముల స్వాధీనానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తోంది. భూములు ఆక్రమించి గృహాలు నిర్మించిన వారితో దేవాదాయ శాఖ అధికారులు చర్చించి, ప్రభుత్వ మార్కెట్ ధర మేరకు భూమి ధర వసూలు చేసేలా కసరత్తు చేస్తున్నారు. రైతులు సాగు చేస్తున్న భూముల విషయంలో ఎలా ముందుకు వెళ్లాలాని ఆలోచిస్తున్నారు.

రెవెన్యూ, దేవాదాయ శాఖ అధికారుల కమిటీ భూమి యాజమాన్య హక్కుల కోసం ఆర్‌వోఆర్ కింద కేసుల నమోదుకు చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. నోటీసుల జారీకి రంగం సిద్ధం చేస్తున్నారు.కసరత్తు చేస్తున్నాం: జిల్లాలో దేవాదాయ శాఖకు చెందిన ఆక్రమిత భూములు గుర్తించామని జిల్లా దేవాదాయ శాఖాధికారి సూర్యప్రకాశరావు తెలిపారు. వీటిని వేరే వారికి బదిలీ కాకుండా పటిష్ఠ చర్యలు చేపడుతున్నామన్నారు. వ్యవసాయ భూములను స్వాధీనం చేసుకుని, కౌలుకిచ్చే ప్రక్రియకు శ్రీకారం చుడుతున్నామని వివరించారు. భూముల స్వాధీనానికి కసరత్తు చేస్తున్నామన్నారు.

# మీ ముగ్గురు ఒకటయితే సరిపోతుందా జానీ.. కిందోళ్లు కావద్దూ




**హైదరాబాద్ పెన్ పవర్:** జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఈ మధ్య తరచూ ఒక వ్యాఖ్య చేస్తున్నారు. కూటమిని ఎవరూ విడదీయలేరంటున్నారు. తమ మిత్రత్వాన్ని చెడగొట్టే పనిచేయలేరని అంటున్నారు. కరెక్టే.. టీడీపీ, జనసేన, బీజేపీ 2029 ఎన్నికల్లో కూడా కలసి పనిచేస్తాయి. అందులో ఎవరికీ పెద్దగా సందేహం లేదు. ఎందుకంటే 2024 లో జరిగిన ఎన్నికల్లోనే వైసీపీకి 40 శాతం ఓట్లు వచ్చాయంటే వచ్చే ఎన్నికల్లో విడిపోతే పడిపోక తప్పదని ముగ్గురికీ తెలుసు. చంద్రబాబు నాయుడు కానీ, నరేంద్ర మోదీ కావచ్చు.. పవన్ కల్యాణ్ అనుకోవచ్చు. తాము ముగ్గురం కలసి ఉంటే విజయం మరొసారి ఖాయమన్న విశ్వాసం ముగ్గురిలోనూ కనపడుతుంది. అందుకే చంద్రబాబు, పవన్ కల్యాణ్ లు ఇద్దరూ మరొకసారి కలిసే పోటీ చేస్తామని చెబుతుండం, జగన్ అధికారంలోకి రానివ్వబోమని చెబుతుండటాన్ని అర్థం చేసుకోవచ్చు.

**స్టేజీ మీద చెప్పిన డైలాగులు...**

అయితే ఇది వింటానికి చాలా బాగుంటుంది. పవన్ కల్యాణ్ చెప్పినట్లుగానే సినిమాల్లో ఆ డైలాగులు బాగుంటాయి. బయట అంటే తొక్కి నారతీస్తాం అని హెచ్చరించారు. అలాగే స్టేజీ పై మాట్లాడిన మాటలు బాగానే ఉంటాయి. విజయం తమదేనని, కూటమి విడిపోదని చెప్పుకోవచ్చు. కానీ వేదిక కింద పరిస్థితి ఏంటన్నది పవన్ కల్యాణ్ కు అర్థమవుతుందా? అని ఆ పార్టీ నేతలే ప్రశ్నిస్తున్నారు. తన సొంత పార్టీ నేతలపైనే అనుమానంతో పవన్ కల్యాణ్ ఒక కన్నువేసి ఉంచడమే కాకుండా సర్వేలు కూడా చేయించుకోవడం చూస్తుంటే ఎమ్మెల్యేలపై వ్యతిరేకత ఎంత మాత్రం ఉందో తెలుసుకునే ప్రయత్నం అయినా ఉండాలి. లేకుంటే వారి గురించి ప్రజలు ఏమనుకుంటున్నారో తెలుసుకోవాలన్న తపన కావచ్చు.

**వారు కాదు కదా?**

ఇదంతా పక్కన పెడితే... మోదీ.. పవన్... చంద్రబాబు ఈ ముగ్గురు కలసి నడుస్తారు. పోటీ చేస్తారు కూడా. అందులో వివాదమే లేదు. కానీ కిందిస్థాయి క్యాడర్ కదా కలసి నడవాల్సింది. సామాజికవర్గాలు కదా కలసి పనిచేయాల్సింది. ద్వితీయ శ్రేణి నేతలు కదా కట్టడిగా ఉండాల్సింది. కానీ ప్రస్తుతం ఏడాదిలోనే కూటమి పార్టీల్లో మూడింటిలో క్యాడర్ సంతృప్తిగా లేదు. కొద్దో గొప్పో కొంత శాతం ఎక్కువగా క్యాడర్ సంతోషంగా ఉంది తెలుగుదేశం పార్టీలోనే. ఎందుకంటే పనులు జరుగుతున్నవి వారికే. కాంట్రాక్టులు దక్కుతున్నవి వారికే. చిన్నచిన్న పనులతో పాటు నామినేటెడ్ పోస్టులు కూడా అత్యధికంగా చేజిక్కించుకుంటున్నది తెలుగు తమ్ముళ్లే. అందుకే తెలుగుదేశం పార్టీలో యాభై శాతం క్యాడర్ సంతృప్తి కరంగానే ఉంది.

**అన్ని నియోజకవర్గాల్లో....**

ఇక జనసేన విషయానికి వస్తే తాము గెలిచిన 21 నియోజకవర్గాల్లో. గెలిపించిన 154 నియోజకవర్గాల్లో సంతృప్తికరంగా లేరు. అసలు నిజం చెప్పాలంటే జనసేనఎమ్మెల్యలు ఉన్న చోట వారికంటే తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్ ఛార్జులకే పనులు ఎక్కువగా జరుగుతున్నట్లు ఆ పార్టీ నేతలే ఆరోపిస్తున్నారు. ఆ ప్రాంతం.. ఈ ప్రాంతం అని లేదు. దాదాపు 175 నియోజకవర్గాల్లో మూడు పార్టీల క్యాడర్ మధ్య సఖ్యత లేదు. కలుపుకుని పోవాలని ప్రయత్నించే నేత లేరు. అలాగే ద్వితీయ శ్రేణి నేతల్లోనూ కలసి ఉందామన్నధ్యాస లేదు. ఒకరిపై ఒకరు కసి, పగ పెంచుకునే స్థాయికి వచ్చారు. ఏడాదిలోనే ఇలా ఉంటే ఇక మీ ముగ్గురు పైన కలసి లాభమేముందయ్యా అని సోషల్ మీడియాలో సెటైర్లు పడుతున్నాయి జనసేనాని పైన.

# హైదరాబాద్ లో ఇకపై 5 రూపాయలకే టిఫిన్




**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ లో రియల్ ఎస్టేట్ రంగానికి ఎప్పటికీ కొదవలేదు. ఎప్పటికప్పుడు కొత్త ప్రాజెక్టులు ఊరిస్తుంటాయి. హైదరాబాద్ నగరం పెరగటమే కాని, నగరంలో రియల్ ఎస్టేట్ తగ్గిన కాలం అస్సలు లేదనే చెప్పాలి. 1990వ దశకం నుంచి ప్రారంభమయిన ఈ ఉధృతి అలాగే కొనసాగుతుంది. పాలకులు, వారి పాలసీలతో సంబంధం లేకుండా పెరిగే ఏకైక నగరం హైదరాబాద్ మాత్రమే. బెంగళూరుకు మించి హైదరాబాద్ నగరం విస్తరించింది. అందుకే మౌలిక సదుపాయాల కల్పనలో ఏ ప్రభుత్వమయినా కోట్ల రూపాయల నిధులను కేటాయిస్తుంది. ఇక మంచి వెదర్ తో పాటు కాస్మోపాలిటన్ సిటీగా మారడం, అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండే నగరం హైదరాబాద్ మాత్రమే.

**విస్తరణకు అనువుగా...**

అందుకే ఏ ప్రభుత్వం వచ్చినా హైదరాబాద్ నగరం విస్తరణకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. పాలసీలను రూపొందించుకోవాల్సి ఉంటుంది. అందరికీ తాగు నీటిని అందించేలా ఏర్పాట్లు చేసుకోవాల్సి ఉంటుంది. ఇక మెట్రో రైలు, ఫ్లై ఓవర్లతో ట్రాఫిక్ చిక్కులకు చెక్ పెట్టే అవకాశాలు కూడా కనిపిస్తున్నాయి. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఫోర్త్ సిటీని కూడా అభివృద్ధి చేయడం ప్రారంభించింది. తాజాగా ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ లో నియో పొలిస్ మరో భారీ ప్రాజెక్టును నిర్మిస్తుంది. దీని విలువ 3,169 కోట్ల రూపాయలుగా అంచానా. దీనికి కాస్ కేడ్స్ నియోపోలిస్ పేరుతో నిర్మిస్తున్నట్లు నిర్మాణ సంస్థ ప్రకటించింది. మొత్తం ఐదు బ్లాక్ లలో ఆరు అంతస్తులను నిర్మిస్తున్నట్లు ప్రకటించింది. మొత్తం 1,189 ఫ్లాట్లు అందుబాటులోకి రానున్నట్లు తెలిపింది. చదరపు గజం పది వేల రూపాయలుగా చెబుతోంది.

**ట్రంప్ టవర్ ఏర్పాటయితే...**

ఇక అదనంగా పార్కింగ్, ఇతర సదుపాయాల కోసం అదనపు మొత్తాన్ని వసూలు చేస్తారు. దీంతో పాటు ట్రంప్ సంస్థ నిర్మించే మరో భవనాలు కూడా అందుబాటులోకి రానున్నాయి. హైదరాబాద్ లో ట్రంప్ టవర్ అందుబాటులోకి వస్తే నగరం రూపురేఖలే మారనున్నాయి. అత్యంత ఎత్తైన ఈ టవర్ల నిర్మాణపనులు ప్రారంభ కానున్నాయి కోకాపేట్ లో నిర్మాణమయ్యే ట్రంప్ టవర్ కూడా ఏర్పాటయితే ఇక హైదరాబాద్ అభివృద్ధిని ఎవరూ అపలేరన్నది వాస్తవం. . కోకాపేట్ లోని నాలుగు ఎకరాల విస్తీర్ణంలో ట్రంప్ టవర్స్ ను నిర్మించనున్నారు. వీటిని ట్రిబెకా డెవలపర్స్ నిర్మిస్తున్నట్లు ఇప్పటికే రియల్ ఎస్టేట్ రంగంలో జోరుగా ప్రచారం జరుగుతుంది. ట్రంప్ టవర్స్ అంచనా వ్యయం మూడు వేల ఐదు వందల కోట్ల రూపాయలు అని చెబుతున్నారు. మొత్తం నాలుగు వందల వరకూ లగ్జరీ ఫ్లాట్లను నిర్మించనున్నారు. ఒక్కొక్క ఫ్లాట్ ధర ఐదు కోట్ల రూపాయలకు పైగానే ఉంటుందని ప్రాధమిక అంచనా.

**నగరానికి నాలుగువైపులా...**

ఇక మధ్యతరగతి ప్రజల కోసం కూడా అనేక అపార్ట్ మెంట్లు నగరానికి నాలుగువైపులా నిర్మాణమవుతున్నాయి. ఇటు మేడ్చల్, హయత్ నగర్, సాగర్ రోడ్డులో చాలా వరకూ నిర్మాణాలు ఊపందుకున్నాయి. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మాణం చేయతలపెట్టిన ఫోర్త్ సిటీలో కూడా భూముల ధరలు పెరిగాయి. ఎంతగా అంటే ఇప్పుడు అక్కడ సామాన్యులు, మధ్యతరగతి ప్రజలు కొనుగోలు చేయలేనంతగా పెరిగిపోయాయి. అక్కడకు మెట్రో రైలు ప్రతిపాదనను కూడా ప్రభుత్వం సిద్ధం చేస్తుంది. అది పూర్తయిందంటే అక్కడ కూడా అభివృద్ధిని ఆపడం ఎవరి తరమూ కాదు. ఇటు ధనిక, అటు మధ్యతరగతి ప్రజలకు అనుగుణంగా నివాస భవనాలు రెడీ టూ ఆక్యూపైకి సిద్ధంగా ఉండటంతో హైదరాబాద్ మరో ఏడాదిలో మరో పది లక్షల జనాభా పెరుగుతుందన్న అంచనాలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి పెట్టాల్సి ఉంటుంది.

# విజయవాడలో ఘరానా మోసం.. లక్షకు నెలకు ఆరు నెలల వడ్డీ పేరుతో వంచన




**హైదరాబాద్ పెన్ పవర్:** లక్ష రూపాయలు పెట్టుబడితే నెలకు ఆరు వేల రూపాయలు వడ్డీ. ఎన్ని లక్షలయినా పెట్టొచ్చు. లిమిట్ లేదు. అంటూ అద్విక సంస్థ విజయవాడలోజనాన్ని నమ్మించింది. పెట్టుబడికి ఇదే సరైన మార్గమని చెబుతూ బోలెడు ప్రకటనలు చేసింది. అద్వైక ట్రేడింగ్ కంపెనీ పేరుతో విజయవాడలో డిపాజిట్ల పేరుతో మూడు వందల కోట్ల రూపాయలు సేకరించి చివరకు చేతులెత్తేసింది. పెట్టుబడి పెట్టిన వారు లబోదిబోమంటున్నారు. పోలీసులను ఆశ్రయించారు.నిబంధనలకు విరుద్ధంగా, ఆర్బీఐ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ఈ సంస్థలో లక్షలు పెట్టుబడి నేడు లబోదిబోమంటున్నారు అనేక మంది బాధితులు.

**ఎల్ఐసీ ఏజెంట్ గా పనిచేసి...**

ఇప్పటి వరకూ వడ్డీ డబ్బు కూడా సరిగా చెల్లించకపోవడంతో నిర్వాహకుడిని నిలదీశారు. దీంతో కొందరు పోలీసులను ఆశ్రయించారు. వెంటనే విజయవాడ పోలీసులు అద్వైక ట్రేడింగ్ కంపెనీ నిర్వాహకుడు ఆదిత్యను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. నెలకు ఆరు శాతం వడ్డీ అంటే ఆశపడి అనేక మంది ఈ కంపెనీలో పెట్టుబడి పెట్టినట్లు సమాచారం. వేల సంఖ్యలోనే అద్వైక కంపెనీ బాధితులున్నారని చెబుతున్నారు. పోలీసు కేసు నమోదయిందని తెలుసుకుని మిగిలిన వారు కూడా పోలీస్ స్టేషన్ కు వచ్చి తమ పత్రాలను చూపి ఫిర్యాదుచేస్తున్నారు. తాడేపల్లికి చెందిన ఆదిత్య విజయవాడలో కొన్నాళ్ల పాటు ఎల్ఐసీ ఎజెంట్ గా పనిచేసి ఆ తర్వాత తక్కువ సమయంలో ఎక్కువ ధనాన్ని సంపాదించాలని అద్వైక ట్రేడింగ్ కంపెనీని ఏర్పాటు చేశాడు.

**మూడు జిల్లాల నుంచి...**

2022లో ఏర్పాటయిన అద్వైక ట్రేడింగ్ కంపెనీ విజయవాడలో బ్రాంచ్ లు కూడా ఏర్పాటు చేశారు. గుణదల, ఎల్ఐసీ కాలనీల్లో అద్వైక కంపెనీ కార్యాలయాలను ఏర్పాటు చేసి ప్రజలను ఆకట్టుకనే ప్రయత్నం చేశాడు ఆదిత్య. కేవలం విజయవాడ మాత్రమే కాదు కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాల నుంచి వచ్చి మరీ పెట్టుబడులు పెట్టారు. ప్రజలను ఆకర్షించేందుకు ప్రత్యేకంగా ఏజెంట్లను నియమించుకున్నాడు. సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేయడంతో అందరూ నమ్మేశారు. పదవీ విరమణ చేసిన వారి దగ్గర నుంచి కొద్దో గొప్పో డబ్బు దాచి పెట్టుకున్న వారంతా అద్వైక కంపెనీకి సమర్పించుకున్నారు.

దాదాపు పన్నెండు వందల మంది మూడు వందల కోట్లు పెట్టుబడి పెట్టారంట్నున్నారు. తొలుత సక్రమంగా వడ్డీ చెల్లించిన గత కొన్ని నెలల నుంచి వడ్డీ డబ్బులు కూడా ఇవ్వకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ బాగోతం వెలుగు చూసింది.

# బంగాళాఖాతంలో అల్పపీడనం.. మరో మూడు రోజులు వర్షాలేనట




**హైదరాబాద్ పెన్ పవర్:** బంగాళాఖాతంలో ఏర్పడనున్న అల్పపీడనంతో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడతాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. మరికొద్ది గంటల్లోనే అల్పపీడనం ఏర్పడే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. అల్పపీడనం ప్రభావంతో రాబోయే మూడు రోజుల పాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడతాయని చెప్పింది. అల్పపీడనం ప్రభావంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ కేంద్రం తెలిపింది. అయితే కొద్ది రోజులుగా నైరుతి రుతుపవనాలు మందగించడంతో వర్షాలు కురియడం లేదని కూడా పేర్కొంది.

**మూడు రోజుల పాటు...**

నైరుతి రుతుపవనాలు ముందుగానే వచ్చినా కరెక్టగా ఖరీఫ్ సాగు సమయంలో వరుణుడు మొహంచాటేయడంతో అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. అయితే కొన్ని ప్రాంతాల్లో వర్షాలుపడుతుండటంతో రైతుల కళ్లల్లో ఆనందం కనపడుతుంది. ఈరోజు నిజామాబాద్, మెదక్, నిర్మల్, మంచిర్యాల, జగిత్యాల, ఆసిఫాబాద్, ఆదిలాబాద్, ములుగు, వరంగల్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో వర్షాలు పడే అవకాశముందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. బలమైన ఈదురుగ్నాలు వీచే అవకాశముందని చెప్పారు.

**చేపల వేటకు వెళితే...**

ఆంధ్రప్రదేశ్ లోనూ అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు పడతాయని విశాఖ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. బలమైన ఈదురుగాలులు వీస్తాయని తెలిపింది. గంటకు యాభై నుంచి అరవై కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముందని కూడా వాతావరణ శాఖ తెలిపింది. మత్స్యకారులు చేపలవేటకు వెళ్లినసమయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించింది. చేపల వేటకు మత్స్యకారులు వెళ్లకపోవడమే మంచిదని కూడా చెప్పింది. ఈరోజు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, నెల్లూరు జిల్లాల్లో భారీ వర్షాలు మిగిలిన జిల్లాల్లో మోస్తరు వర్షాలు పడతాయని వాతావరణ శాఖ చెప్పింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

# గోల్డ్ లవర్స్ కు గుడ్ న్యూస్.. నేటి బంగారం ధరలు ఎలా ఉన్నాయంటే?




**హైదరాబాద్ పెన్ పవర్:** బంగారం ధరలు తగ్గితే ఆనందం. పెరిగితే ఆవేదన. ఇది గత ఆరు నెలలుగా ఎక్కువ రోజులు పసిడిప్రియులు ఆవేదనతోనే గడిపారు. ఎందుకంటే ఈ ఏడాది జనవరి ఆరంభం నుంచి మొన్నటి వరకూ ఆవేదన ఎక్కువగా కనపడింది. ఎందుకంటే ధరలు విపరీతంగా పెరిగాయి. పది గ్రాముల బంగారం ధర లక్ష రూపాయలు దాటేయటం అంటే మాటలా? నిజానికి మార్కెట్ నిపుణుల అంచనా ప్రకారం పది గ్రాముల బంగారం ధర లక్ష రూపాయలు చేరుకోవడానికి వచ్చే ఏడాది పడుతుందని అంచనా వేశారు. కానీ ఈ ఏడాది మార్చి నెలలోనే లక్ష రూపాయలు దాటేయడంతో వారి అంచనాలు కూడా నిజం కాలేదు. అలాగే ఇప్పుడు లక్ష రూపాయల నుంచి దిగువకు ధరలు దిగి వచ్చినా ఇంకా అందరికీ అందుబాటులోకి రాలేదంటున్నారు.

**దక్షిణ భారతంలోనే...**

గోల్డ్ అంటే అత్యంత ఇష్టపడే వారు ప్రపంచంలోనే భారతీయులు అత్యధికంగా ఉన్నారు. అందులోనూ ముఖ్యంగా దక్షిణ భారత దేశంలోని మహిళలు బంగారం కొనుగోలు కోసం పరితపించి పోతుంటారు. పండగ, పుట్టిన రోజుకు కూడా బంగారం కొనుగోలుచేయాలన్న తపన వారికి ఎక్కువ కనపడుతుంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లో బంగారం సేల్స్ ఎక్కువగా ఉంటాయని వ్యాపారులు కూడా చెబుతారు. ఇక ముహూర్తాలు, పెళ్లిళ్ల సీజన్ లో అయితే చెప్పాల్సిన పనిలేదు. జ్యుయలరీ దుకాణాల్లో కాలు మోపడానికి కూడా అవకాశముండదు. అలాంటిది గత ఆరు నెలలుగా బంగారం దుకాణాలు కస్టమర్లు లేక వెలవెలబోతున్నాయి.

**నేటి ధరలు...**

పెరుగుతున్న ధరలతో పాటు దుకాణాల యాజమాన్యం వేస్తున్న తరుగు, ప్రభుత్వం వేస్తున్న జీఎస్టీ వంటి వాటితో బంగారం ధరలు మరింతగా పెరిగాయి. దీంతో బంగారం కొనుగోలు చేయలేక చాలా మంది పెళ్లి తంతు ముగించేశారు. ఈరోజు దేశంలో బంగారం ధరలు స్థిరంగా ఉన్నాయి. వెండి ధరలు కూడా నిలకడగా కొనసాగుతున్నాయి. ఉదయం ఆరు గంటలకు హైదరాబాద్ బులియన్ మార్కెట్ లో బంగారం, వెండి ధరలు ఇలా ఉన్నాయి. 22 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర 90,690 రూపాయలుగా ఉంది. 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర 98,940 రూపాయలుగా నమోదయింది. కిలో వెండి ధర 1,17,900 రూపాయలుగా కొనసాగుతుంది. మధ్యాహ్ననికి ఈ ధరల్లో మార్పులు ఉండవచ్చు.

# అటు కొడుకు.. ఇటు కుమార్తె.. మధ్యలో కేసీఆర్.. కారు స్టీరింగ్ ఎవరి చేతిలో?




బీఆర్ఎస్ లో ఏదో బయటకు కనపడని రాజకీయం నడుస్తుంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితల మధ్య అంతర్గత వార్ నడుస్తున్నట్లే కనిపిస్తుంది. అన్న నాయకత్వాన్ని కవిత అంగీకరించినట్లు కనిపించడం లేదు. అందుకోసమే తెలంగాణ జాగృతి సంస్థను తిరిగి యాక్టివ్ చేశారు. అన్నివిభాగాలను నియమించారు. తానే జాగృతి చీఫ్ అని ప్రకటించుకున్న కవిత తనంతట తానే కార్యక్రమాలను డిజైన్ చేసుకుంటున్నారు. కేసీఆర్ కు లేఖ బహిర్గతమయినప్పుడు, కేటీఆర్ పై ఆఫ్ ది రికార్డులో కవిత కేటీఆర్ పైవిమర్శలు చేసినప్పుడు ఆయన హైదరాబాద్ లో లేరు. విదేశాల్లో ఉన్నారు. విదేశాల నుంచి వచ్చిన కేటీఆర్ కవిత వ్యాఖ్యలపై ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు కాని దూరం మాత్రం పెరిగినట్లు కనిపిస్తుంది.

**ఒకరికొకరు ఎదురుపడకుండా...**

ఈ నెల 11న కేసీఆర్ కాళేశ్వరం కమిషన్ ఎదుటకు విచారణకు వస్తున్న సందర్భంలో కవిత ఎర్రవెల్లి ఫామ్ హౌస్ కు వెళ్లారు. అక్కడ కవిత ఉందనేమో తెలియదు కానీ కేటీఆర్ మాత్రం నాడు ఫామ్ హౌస్ కు వెళ్లలేదు. కేసీఆర్ వెంట కమిషన్ ఎదుటకు కూడా కేటీఆర్ వెళ్లలేదు. మరొకవైపు కేటీఆర్ ను ఫార్ములా ఈరేసు కేసులో ఈనెల 16వ తేదీన ఏసీబీ అధికారులు విచారణకు పిలిచినప్పుడు అందరు నేతలు కేటీఆర్ వద్దకు వచ్చారు. అయితే ఆరోజు కవిత జగిత్యాల పర్యటనకు వెళ్లడం కూడా ఇద్దరి మధ్య దూరం కొనసాగుతుందన్న విషయం కనపడుతుంది. ఎందుకంటే కేటీఆర్ తనను అరెస్ట్ చేయవచ్చని నాడు చేసిన వ్యాఖ్యలతో బీఆర్ఎస్ నేతలందరూ వచ్చినా కవిత మాత్రం రాకపోవడం పార్టీలోచర్చనీయాంశమైంది.

**సొంత కార్యక్రమాలతో కవిత...**

దీనికి తోడు కల్వకుంట్ల కవిత గత కొన్ని రోజుల నుంచి తెలంగాణ భవన్ కు దూరంగానే ఉంటున్నారు. పైగా కేసీఆర్ నుకమిషన్ విచారణకు పిలిచిందని ఇందిరాపార్కు వద్ద ధర్నా చేస్తే బీఆర్ఎస్ నేతలు ఎవరూ అక్కడకు హాజరు కాలేదు. ఇప్పుడు కవిత ఏకంగా తనంతట తాను సొంతంగా కార్యక్రమాలను డిజైన్ చేసుకుంటూ పిలుపునిస్తుండటం చర్చనీయాంశమైంది. బీసీల రిజర్వేషన్లపై పోరాటానికి కవిత సిద్ధమయ్యారు. జులై 17వ తేదీన రైల్ రోకోకు పిలుపు నిచ్చారు. అంతే కాదు అవసరమైతే ఢిల్లీలో ఆందోళన నిర్వహిస్తామని కూడా తెలిపారు. ఇలా మరొక వైపు కేసీఆర్ రైతులకు అనుకూలంగా కొన్ని ఆందోళన కార్యక్రమాలు చేయాలని కార్యక్రమాలకు పిలుపు నిచ్చారు. ఇందుకోసం కేటీఆర్ పార్టీ శ్రేణులను సిద్ధం చేస్తున్నారు.

**కేటీఆర్ కార్యక్రమాలు మరొకవైపు...**

ఇలా అన్న కేటీఆర్ ఒక వైపు వేరేలా కార్యక్రమాలను రూపొందించుకుంటుంటే...మరొకవైపు సోదరి కవిత మరొక అంశాన్ని తీసుకుని జనంలోకి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇద్దరివీ వేర్వేరు దారులన్నది స్పష్టంగా తెలుస్తోంది. తాను కేసీఆర్ నాయకత్వాన్ని తప్పించి మరొకరి నాయకత్వాన్ని అంగీకరించబోనని కవిత తేల్చి చెబుతుండగా, కేటీఆర్ మాత్రం కవిత కార్యక్రమాలకు ఎవరూ వెళ్లవద్దంటూ బీఆర్ఎస్ నేతలకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో జోక్యం చేసుకోవాల్సిన కేసీఆర్ మాత్రం ఎర్రవెల్లి ఫామ్ హౌస్ కే పరిమితమయ్యారు. ఇలా అన్నా చెల్లెళ్లు కారు స్టీరింగ్ ను చెరొక చేతుల్లోకి తీసుకోవడంతో అది ఎటువైపు పయనిస్తుందన్నది క్యాడర్ లో మాత్రం అయోమయం నెలకొంది. మొత్తం మీద బీఆర్ఎస్ లో ఏదో జరుగుతుంది. అది కేసీఆర్ కు తెలిసి జరుగుతుందా? తెలియక జరుగుతుందా? అన్నది మాత్రం భవిష్యత్ లో తేలనుంది.

# ఇదేమి వేట చెల్లీ... ఇంత సాధింపులయితే ఎలా తల్లీ?




**హైదరాబాద్ పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల తనకు తాను ఏమనుకుంటుందో తెలియదు. వైఎస్ లెగసీ తనకే ఉందన్న భ్రమలో ఆమె ఉన్నట్లు కనపడుతుంది. అన్నపై పోరాటం చేయవచ్చు. ఇరువురి పార్టీలు వేరు కాబట్టి ఎవరూ వ్యతిరేకించరు. కానీ అదే పనిగా అధికార పార్టీ కంటే ఎక్కువగా సోదరుడిపైనా, ఆ పార్టీ పైన విమర్శలు చేస్తుండటం చూస్తే వైఎస్ షర్మిలలో ఫ్రస్టేషన్ పీక్స్ కు చేరకున్నట్లు కనిపిస్తుంది. ఏ చిన్న అవకాశాన్ని కూడా షర్మిల వదిలిపెట్టడం లేదు. బహుశ అధికార పార్టీ కంటే ఎక్కువగానే విమర్శలు చేస్తుండటం కొంత ఏవగింపుగా మారింది. కేవలం వైసీపీ అభిమానులకు మాత్రమే కాదు. కాంగ్రెస్ పార్టీలోని నేతలు, వైఎస్ తో సంబంధమున్న ముఖ్యమైన సీనియర్ నేతలు సయితం ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

**ఆస్తుల వివాదాలే కారణమని...**

ప్రజాసమస్యలపై పోరాటం చేసి ప్రజల్లోకి వెళ్లాలి. సోదరుడిని ఓడించాలంటే ఇది మార్గం కాదని వైఎస్ షర్మిలకు సన్నిహితులు, కుటుంబ సభ్యులు ఎవరు చెప్పినా ఆమె ఏకైక లక్ష్యం. జగన్ తిరిగి ముఖ్యమంత్రి కాకూడదనేలా అనిపిస్తుందని వైఎస్ రాజశేఖర్ రెడ్డి కుటుంబంలోని కొందరు చేస్తున్న వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఆస్తుల వివాదాలే ఈ కక్ష్య లకు కారణం కావచ్చు. ఆస్తి పంచి ఇవ్వకపోవడం జగన్ తప్పు కావచ్చు. అయితే అది కుటుంబ పెద్దల సమక్షంలో పంచాయతీ పెట్టి, సన్నిహితులు, బంధువుల మధ్య రాజీ కుదుర్చుకోవాల్సిన అన్నా చెల్లెళ్లు ఇద్దరూ ఆగర్భ శత్రువులుగా మారారని చెప్పడంలో అతిశయోక్తి లేదు.

**సొంత ప్రయోజనాలకోసమేనంటూ...**

ఇక్కడ ఉన్న వీరు కొట్లాడుకుంటూ, వీధి పోరాటాలు చేసుకుంటుంటే కొందరు ఆనందపడవచ్చేమో కానీ పైలోకంలో ఉన్న వైఎస్ ఆత్మ మాత్రం శాంతించిందనే అంటున్నారు. అసలు అధికార పార్టీ తప్పొప్పులను అప్పుడప్పుడు ప్రస్తావిస్తున్నప్పటికీ జగన్ విషయాన్ని పట్టుకుని లాగుతుండటంతో సొంత పార్టీలోనే అసమ్మతి గ్రూపులు బయలుదేరాయి. వైఎఎస్ షర్మిల కాంగ్రెస్ పార్టీలోకి వచ్చింది సొంత ప్రయోజనాలు కోసమే కాని, పార్టీ బలోపేతం చేయడం కోసం కాదని పార్టీలో ని ముఖ్యనేతలే బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారు. సుంకర పద్మశ్రీ వంటి వారు అయితే ఏకంగా జిల్లాల్లో షర్మిలకు వ్యతిరేకంగా సభలు పెట్టి కార్యకర్తలను ఏకం చేసే పనిలో ఉన్నారు.

**జగన్ పై తీవ్ర విమర్శలు...**

ఇప్పుడు వైఎస్ షర్మిల జగన్ పర్యటనలకు అనుమతి ఇవ్వవద్దంటూ ప్రభుత్వాన్ని వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. జగన్ ను జైల్లో పెట్టాలని కోరడం కూడా ఆమె కసికి తార్కాణమని చెప్పాలి. వివేకా ను చంపి సునీత మీద నెట్టేసినోళ్ళకు, సింగయ్యను తొక్కి చంపి %ూ×% గ్రాఫిక్స్ అనడం ఒక లెక్కనా ? అంటూ వైఎస్ షర్మిల ప్రశ్నించారు. వివేకా హత్య విషయంలో సీబీఐ అన్ని ఆధారాలు చూపుతుంటే సునీత చంపింది అనేటోళ్లకు..టైర్ల కింద తొక్కి గ్రాఫిక్స్ అనక ఏమంటారు ? అని వైఎస్ షర్మిల నిలదీశారు. ఇలా జగన్ వెంటాడమే పనిగా పెట్టుకున్నట్లుందని సొంత పార్టీ నేతలే పార్టీ హైకమాండ్ కు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. హైకమాండ్ కూడా వైఎస్ షర్మిలను పీసీసీ చీఫ్ గా కొనసాగించడంపై పునరాలోచనలో పడినట్లు సీనియర్ కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. షర్మిల కంటే చింతామోహన్, హర్షకుమార్ లాంటి నేతలు ఎక్కువగా అధికార పార్టీ నిర్ణయాలను తప్పుపడుతున్నారన్న కామెంట్స్ వినపడుతున్నాయి.

# యనమలను ఎవరూ పట్టించుకోవడం లేదా? ఎందుకీ పరిస్థితి?



**హైదరాబాద్ పెన్ పవర్:** సీనియర్ నేత, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు గుర్తింపు లేదని మదన పడుతున్నారా? ఎన్నికల్లో పోటీకి దూరమంటూ గతంలో ప్రకటించిన యనమల పార్టీలో అధికారంలో ఉండటంతో యాక్టివ్ గా ఉండాలని అనుకుంటున్నారు. తన సహచరులైన సీనియర్ నేతలు అశోక్ గజపతిరాజు, కేఈ కృష్ణమూర్తి వంటివారు అస్త్ర సన్యాసం చేసి తమ బాధ్యతలను వారసులకు అప్పగించినా యనమల మాత్రం క్రియాశీలంగానే ఉండాలని కోరుకుంటున్నారని ఆయన అనుచరులు అంటున్నారు. దీంతో నిత్యం వార్తల్లో నిలిచేలా ఆయన ప్రకటనలు చేస్తున్నారు. అధినేత దృష్టిలో పడేందుకు ప్రయత్నిస్తున్నారని చెబుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, సీనియర్ నేత యనమలకు మంచి సంబంధాలే ఉన్నాయి. అయితే 2004 ఎన్నికల్లో ఓటమి తర్వాత ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉండిపోయిన యనమల తన స్థానంలో వరుసకు సోదరుడైన యనమల క్రిష్ణుడిని ప్రోత్సహించారు. అయితే ఆయన వరుసగా మూడుసార్లు ఓడిపోవడంతో గత ఎన్నికల్లో యనమల కుమార్తె దివ్యను బరిలోకి దింపారు. ఈ సారి యనమల సీనియార్టీ, పార్టీ హవా కలిసొచ్చి దివ్య సునాయాశంగా గెలిచారు. అలా తుని నియోజకవర్గంలో 20 ఏళ్ల తర్వాత జెండా ఎగరేసిన యనమల తనకు కూడా పదవి ఉంటే బాగుంటుందని పార్టీకి సంకేతాలిస్తున్నారు.

2014లో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఎమ్మెల్సీ ఎన్నికై ఆ తర్వాత మంత్రి పదవి చేపట్టారు. ఆరు నెలల క్రితం యనమల ఎమ్మెల్సీ పదవీకాలం పూర్తి కావడంతో ఆయన మాజీ అయ్యారు. పార్టీ అధికారంలో ఉండటంతో ఆయనకు మరోమారు రెన్యువల్ ఉంటుందని భావించారు. అయితే ఆశావహులు ఎక్కువగా ఉండటం, పొత్తు ధర్మం వల్ల యనమలకు పొడిగింపు ఇవ్వలేదని చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో యనమల కొంత అసంతృప్తికి లోనయ్యారని ప్రచారం జరిగింది. అయితే పార్టీ నాయకత్వం ఆయనకు సర్దిచెప్పడంతో అలక మూన్నాళ్లకే ముగిసిందని అంటున్నారు. అయితే ఆ సమయంలో తనకు రాజ్యసభకు వెళ్లాలనే ఆలోచన ఉందన్న విషయాన్ని యనమల పార్టీకి నివేదించారు. దీనిపై అధినేత నుంచి ఎలాంటి స్పందన రాలేదంటున్నారు.

దీంతో వయసు ఎక్కువగా ఉండటం వల్ల అధినేత చంద్రబాబు తనను పట్టించుకోవడం లేదని భావిస్తున్న యనమల ఇటీవల స్పీడు పెంచారు. నలబైయేళ్ల పొలిటికల్ కెరీర్ లో ఎప్పుడూ లేని విధంగా ఆయన చేస్తున్న ప్రకటనలు చర్చనీయాంశమవుతున్నాయి. వైసీపీ అంటే ఏ ఒక్కరికీ పని చేయొద్దని యనమల ఇటీవల చేసిన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి. మరోవైపు తన సొంత నియోజకవర్గం తునిలో కుమార్తె దివ్య ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ యనమలే యాక్టివ్ గా తిరుగుతున్నారు. పార్టీ పరమైన నిర్ణయాలతోపాటు అభివృద్ధి పనులను ఆయనే పర్యవేక్షిస్తున్నారని అంటున్నారు. తాను ఇంత యాక్టివ్గా ఉన్న అధిష్టానం పట్టించుకోవడం లేదన్న ఆవేదన ఆయనలో కనిపిస్తోందని యనమల అనుచరులు చెబుతున్నారు. మీడియా సైతం యనమలకు సరైన ప్రచారం ఇవ్వడం లేదని యనమల అనుచరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీనియర్ నేత అన్న కారణం తప్ప, యనమలకు ఏ ప్రొటోకాల్ లేకపోవడం వల్ల ఆయనకు తగిన గౌరవం లభించడం లేదన్న చర్చ జరుగుతోంది. పార్టీ అధికారంలో ఉండగా సీనియర్ నేతలకు తగిన గౌరవం కల్పించాల్సివున్నందున యనమలకు ప్రొటోకాల్ పదవి ఇవ్వాల్సిందేనని ఆయన అనుచరులు పట్టుబడుతున్నారని చెబుతున్నారు. తమ నేతను పట్టించుకోవాలని అధిష్టానంపై ఒత్తిడి తెస్తున్నారని చెబుతున్నారు.

# సిరాజ్ కొత్త వ్యాపారం.. వీడియో చూశారా?




**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా స్టార్ ఫాస్ట్ బౌలర్, హైదరాబాదీ క్రికెటర్ మహ్మద్ సిరాజ్ ఇప్పుడు సరికొత్త రంగంలోకి అడుగుపెట్టారు. తన సోదరుడితో కలిసి ఫుడ్ బిజినెస్ ప్రారంభించి అందరినీ ఆశ్చర్యపరిచారు. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో JOHARFA అనే లగ్జరీ రెస్టారెంట్‌ను ప్రతిష్టాత్మకంగా ప్రారంభించారు. ప్రస్తుతం ఈ రెస్టారెంట్ ప్రారంభోత్సవానికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

ఈ రెస్టారెంట్ మొఘల్, పర్షియన్, అరేబియన్, చైనీస్ వంటకాలతో పాటు లగ్జరీ డైనింగ్ అనుభూతిని అందించేలా ప్రత్యేకంగా డిజైన్ చేయబడింది. హైదరాబాదీ బిర్యానీ నుండి షవర్మా, కబాబ్స్ వరకు అనేక రకాల డిష్‌లు మెనూలో ఉన్నాయని తెలుస్తోంది. సిరాజ్ అభిమానులు, ఫుడ్ లవర్స్ ఇప్పటికే అక్కడికి వచ్చి రుచి చూస్తున్నారు.

**క్రికెట్ నుంచి కొత్త అడుగు**

మైదానంలో వికెట్లు పడగొడుతూ భారత్‌కు విజయాలను అందిస్తున్న సిరాజ్ ఇప్పుడు రెస్టారెంట్ రంగంలోనూ అదే జోరుతో ముందుకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. తక్కువ కాలంలోనే పేరొందిన ఆటగాడిగా పేరు తెచ్చుకున్న సిరాజ్, తన పేరును బిజినెస్‌లోనూ కొనసాగించాలనే లక్ష్యంతో ఈ కొత్త ప్రయాణం మొదలుపెట్టారు.

**రెస్టారెంట్ ప్రత్యేకతలు**

హై-ఎండ్ ఇంటీరియర్ డిజైన్ తో రెస్టారెంట్ లోపలి భాగం అత్యాధునిక డిజైన్‌తో ఆకట్టుకుంటుంది.

కుటుంబ భోజనాలకు అనుకూలమైన వాతావరణం కల్పించారు. కుటుంబంతో కలిసి హాయిగా భోజనం చేయడానికి అనువైన వాతావరణాన్ని కలిగి ఉంది. వివిధ రకాల ప్రముఖ వంటకాలకు ప్రాధాన్యత ఇస్తూ మెనూ రూపొందించబడింది. ఆహారం ప్రెజెంటేషన్ , పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇచ్చారు.

ఈ వీడియోలు చూసిన నెటిజన్లు "సిరాజ్‌కి హ్యాట్సాఫ్", "క్రికెట్ బౌలింగ్‌లాగే బిజినెస్‌లోనూ స్ట్రైక్ చేస్తాడనుకుంటున్నాం" అంటూ సోషల్ మీడియాలో ప్రశంసలతో ముంచెత్తుతున్నారు.

మహ్మద్ సిరాజ్ కేవలం ఒక స్పోర్ట్స్‌స్టార్‌గానే కాకుండా, ఒక యువ పారిశ్రామికవేత్తగా కూడా తనను తాను నిలబెట్టుకుంటున్న తీరు అభినందనీయం. JOHARFA రెస్టారెంట్ తన స్టైల్‌లో సూపర్ హిట్ అవుతుందని అభిమానులు ఆశిస్తున్నారు.

# టీ-కాంగ్రెస్‌కు ఏమైంది? ఎందెందు చూసినా.. సమస్యలే!



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణలో కష్టపడి అధికారంలోకి వచ్చారు. ప్రజలకు ఉన్నదానిలోనే కాదనకుండా మేలు చేస్తున్నారు. సంక్షేమ పథకాలను అందిస్తున్నారు. అందరూ ఐక్యంగా ఉంటే.. వచ్చే ఎన్నికల్లోనూ విజయం దక్కించుకునే అవకాశం కూడా ఉంటుంది. కానీ.. ఆ ఐక్యతే కొరవడుతోంది. ఎవరికి వారు.. ఎక్కడికక్కడ అన్నట్టుగా వివాదాలు.. విభేదాలతోనే కాలం వెళ్లదీస్తున్నారు. ఎందెందు చూసినా.. సమస్యలే కనిపిస్తున్నాయి. ఇదీ.. తెలంగాణ అధికార పార్టీ కాంగ్రెస్‌లో కనిపిస్తున్న ముఖ చిత్రం!ఈ మాట ఎందుకు చెప్పాల్సి వస్తోందంటే.. పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత.. ఇప్పటికి మూడు సార్లు క్రమశిక్షణ సంఘాలను ఏర్పాటు చేసి.. నాయకులపై చర్చించినందుకే!. సాధారణంగా అధికారంలో ఉన్నప్పుడు చిన్నపాటి వివాదాలు వస్తాయి. వాటిని సరిపుచ్చుకునే అవకాశం కూడా ఉంటుంది. కానీ, తాజాగా సీనియర్ నాయకుడు మల్లు రవినేతృత్వంలో వేసిన క్రమశిక్షణ సంఘానికి అసలు క్షేత్రస్థాయిలో ఉన్న వివాదాలను గమనిస్తే.. తలపట్టుకునే పరిస్థితి వచ్చింది.వరంగల్ నుంచి హైదరాబాద్ వరకు.. దాదాపు అన్ని నియోజకవర్గాల్లోనూ వివాదాలు, ఆధిపత్య పోరు... ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకోవడం వంటివి స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఎటు వైపు నిలబడి ఎలాంటి తీర్పు ఇచ్చినా.. ఇబ్బందే అనే పరిస్థితి పార్టీలో ఏర్పడింది.

వరంగల్‌లో మంత్రి కొండా సురేఖ కుంటుంబానికి వ్యతిరేకంగా.. గ్రామ స్థాయి నుంచి నగర స్థాయి వరకు వ్యతిరేకులు పోటెత్తారు. ఇక, ఆసిఫాబాద్ జిల్లాలో రాగి శ్రీనివాస్ దూకుడు పై సొంత నాయకులే విస్తుబోతున్నారు.

దీంతో ఆయనపై చర్యలు తీసుకోవాలని 20పైగా ఫిర్యాదులు అందినట్టు సమాచారం. ఖైరతాబాద్ లో బీఆర్ ఎస్ నుంచి వచ్చిన దానం నాగేందర్‌కు.. మాజీ కాంగ్రెస్ నేత పీజేఆర్ కుమార్తెకు మధ్య తారస్థాయి లో వివాదాలు కొనసాగుతున్నాయి. ఆమె కూడా ఫిర్యాదులు చేశారు. ఆమెపై దానం అనుచరులు ఫిర్యాదు లు ఇచ్చారు. మరోవైపు.. కంట్లో నలుసు మాదిరిగా జీవన్ రెడ్డి వ్యవహారం ఉంది. పఠాన్ చెరు నియోజక వర్గంలోనూ గూడెం మహిపాల్ రెడ్డి

చుట్టూ వివాదాలు ముసురుకున్నాయి. ఇలా.. మొత్తంగా టీ కాంగ్రెస్‌లో వివాదాల పర్వం పెరుగుతూనే ఉంది. ఇవి పైకి కనిపిస్తున్నవని.. కనిపించని వివాదాలు.. అనేకం ఉన్నా యని పరిశీలకులు చెబుతున్నారు.

## వెస్టిండీస్‌కు మూడు సార్లు అన్యాయం.. ఆస్ట్రేలియాకు
# అనుకూలంగా థర్డ్ అంపైర్ నిర్ణయాలు




**హైదరాబాద్ పెన్ పవర్:** ఆస్ట్రేలియాతో జరుగుతున్న తొలి టెస్టులో ఆతిధ్య వెస్టిండీస్ గట్టి పోటీనిస్తుంది. పటిష్టమైన కంగారూల జట్టును ఓడించినంత పని చేస్తోంది. బ్యాటింగ్ లో విఫలమైనా.. బ్యాటర్లు అద్భుతంగా రాణించడంతో తొలి టెస్టులో ఆస్ట్రేలియాను కంగారు పెడుతుంది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్ లో 4 వికెట్ల నష్టానికి 92 పరుగులు చేసింది. క్రీజ్ లో వెబ్ స్టర్ (19), ట్రావిస్ హెడ్ (13) ఉన్నారు. ప్రస్తుతం ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్ లో 82 పరుగుల ఆధిక్యంలో ఉంది. ఈ మ్యాచ్ లో వెస్టిండీస్ కు థర్డ్ అంపైర్ ఇస్తున్న నిర్ణయాలు వివాదాస్పదంగా మారుతున్నాయి.

**క్యారీ కింద పెట్టినా ఔట్:**
వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్‌లో షాయ్ హోప్ ఔట్ ఆశ్చర్యకరంగా అనిపిస్తుంది. బ్యూ వెబ్‌స్టర్ వేసిన బంతిని ఆడే క్రమంలో హోప్ బ్యాట్ ఇన్‌సైడ్ ఎడ్జ్‌లో తగిలి బంతి వికెట్ కీపర్ అలెక్స్ క్యారీ ఎడమ వైపుకు వెళ్లింది. కష్ట తరమైన ఈ క్యాచ్ ను ఆసీస్ వికెట్ కీపర్ డైవ్ చేసి ఒంటి చేత్తో అందుకున్నాడు. అయితే బంతి గ్లోవ్ లో పడకుండా అంతకంటే ముందు నేలను తాకినట్లు రీప్లేలో అనిపించింది. అయితే థర్డ్ అంపైర్ మాత్రం ఔటిచ్చాడు.

**అల్ట్రాఎడ్జ్ అయినా ఎల్బీడబ్ల్యూగా అవుట్:**
వెస్టిండీస్ కెప్టెన్ రోస్టన్ చేజ్ తొలి ఇన్నింగ్స్‌లో ఎల్బీడబ్ల్యూగా ఔట్ కావడం తీవ్ర విమర్శలకు గురి చేస్తుంది. ఆసీస్ కెప్టెన్ పాట్ కమ్మిన్స్ వేసిన 50వ ఓవర్లో చేజ్ బంతిని డిఫెన్స్ ఆడాడు. అయితే బంతి ప్యాడ్లను తాకడంతో ఆసీస్ ఆటగాళ్లు అప్పీల్ చేశారు. రీప్లేలో బాల్ బ్యాట్ కు తగిలినట్టు అల్ట్రాఎడ్జ్ లో చూపించింది. అయితే థర్డ్ అంపైర్ బ్యాట్, బంతి మధ్య గ్యాప్ ఉందని భావించి ఎల్బీడబ్ల్యూ అంటూ ఔటిచ్చాడు.

**హెడ్ క్యాచ్ వివాదాస్పదం:**
ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేస్తుండగా మరొక నిర్ణయం షాకింగ్ గా అనిపించింది. షమర్ జోసెఫ్ వేసిన బంతిని హెడ్ షాట్ ఆడదామని చూస్తే ఎడ్జ్ తీసుకొని వికెట్ కీపర్ హోప్ చేతుల్లోకి వెళ్ళింది. క్లీన్ క్యాచ్ అవునో కాదో అనే అనుమానంలో ఆన్ ఫీల్డ్ అంపైర్ నిర్ణయాన్ని థర్డ్ అంపైర్ కు వదిలేశాడు. థర్డ్ అంపైర్ బాల్ చేతుల్లో పడిందో లేదో అని ఖచ్చితంగా చెప్పలేకపోయాడు. ఖచ్చితమైన ఆధారాలు లేవని నాటౌట్ గా ప్రకటించాడు. ఈ మూడు నిర్ణయాలు వెస్టిండీస్ కు ప్రతికూలంగా మారాయి. ఒకవేళ వెస్టిండీస్ ఈ టెస్టులో ఓడిపోతే అంపైర్ నిర్ణయాలే అని నెటిజన్స్ కామెంట్ చేస్తున్నారు.

ఈ మ్యాచ్ విష యానికి వస్తే 4 వికెట్ల నష్టానికి 57 పరుగులతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన వెస్టిండీస్ 190 పరుగులకు ఆలౌటైంది. ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ లో 180 పరుగులకు ఆలౌట్ కావడంతో వెస్టిండీస్ కు తొలి ఇన్నింగ్స్ లో 10 పరుగుల స్వల్ప ఆధిక్యం దక్కింది. రెండో రోజు హోప్ (48) రాణించగా కెప్టెన్ ఛేజ్ 44 పరుగులు చేసి పర్వాలేదనిపించారు. ఆస్ట్రేలియా బౌలర్లలో స్టార్క్ మూడు వికెట్లుయి తీసుకున్నాడు. హేజల్ వుడ్, కమ్మిన్స్, వెబ్ స్టర్ తలో రెండు వికెట్లు పడగొట్టారు. లియోన్ కు ఒక వికెట్ దక్కింది.

# ఇండియాలో కోహ్లీనే టాప్.. ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక్క పోస్ట్‌తో రూ.12 కోట్లు




**హైదరాబాద్ పెన్ పవర్:** ఆటలోనే కాదు.. ఆర్జనలోనూ టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ దుమ్మురేపుతున్నాడు. ఫోర్బ్స్ రిచ్చెస్ట్ అథ్లెట్ల జాబితాలో చోటు సంపాదించిన విరాట్.. మరో ఘనతను కూడా సాధించాడు. ఇన్‌స్టాగ్రామ్ ద్వారా భారీ మొత్తం సంపాదిస్తూ దూసుకెళ్తున్నాడు. ప్రపంచ వ్యాప్తంగా 274 మిలియన్ల ఫాలోవర్స్ కలిగివున్న కోహ్లీ.. ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక్కో పోస్టుకు రూ.12 కోట్లు ఆర్జిస్తున్నాడు. ప్రపంచవ్యాప్తంగా ఇన్‌స్టా సంపాదనలో విరాట్ కోహ్లీ 14 స్థానంలో ఉండగా.. ఇండియా తరపున అగ్రస్థానంలో ఉన్నాడు.
ఇన్‌స్టా సంపాదనలో ఫుట్‌బాల్ దిగ్గజాలు క్రిస్టియానో రొనాల్డో (658 మిలియన్), మెస్సి (505 మిలియన్) మాత్రమే కోహ్లీ కంటే ముందున్నారు. రొనాల్డో ఒక్కో పోస్టుకు రూ.27 కోట్లు వసూలు చేస్తుండగా.. మెస్సి రూ.22 కోట్లు వసూలు చేస్తున్నారు. కాగా, కోహ్లీ నికర విలువ రూ.1000 కోట్లకు పైనే ఉన్నట్టు సమాచారం. ఇంస్టాగ్రామ్ సంపాదనలో కోహ్లీ మాత్రమే ఇండియా నుంచి టాప్-20 లో ఉన్నాడు.

**రూ.80 కోట్ల విలువైన ఇల్లు**
కోహ్లీ ప్రాపర్టీస్ విలువు రూ.1050 కోట్లుగా ఉన్నట్టు సమాచారం. ముంబైలో రూ.34 కోట్లు విలువ చేసే ఇల్లు, గుర్గామ్‌లో రూ.80 కోట్ల విలువైన మరో ఇల్లు ఉన్నట్లు తెలిపింది. ఇక రన్ మెషిన్ వద్ద ఉన్న కార్ల విలువ రూ.30 కోట్ల పైమాటే. ఆడి, రేంజ్ రోవర్, ఫార్చ్యూనర్, బెంట్లీ వంటి లగ్జరీ కార్లున్నాయి.

**బీసీసీఐ నుంచి ఏడాదికి రూ.7 కోట్ల**
కోహ్లీకి క్రికెట్ పరంగా బీసీసీఐ నుంచి ఏడాదికి రూ.7 కోట్ల వార్షిక వేతనం అందుతోంది. దీనికి అదనంగా మ్యాచ్ ఫీజుల రూపంలో ఒక్కో టెస్ట్ మ్యాచ్‌కు రూ.15 లక్షలు, వన్డేకు రూ.6 లక్షలు, టీ20కి రూ.3 లక్షలు తీసుకున్నాడు. ప్రస్తుతం కోహ్లీ వన్డే క్రికెట్ లో మాత్రమే కొనసాగుతున్నాడు. ఇవి కాకుండా ఐపీఎల్‌లో ఆర్సీబీ తరుపున ఆడుతున్నందకు రూ.21 కోట్ల వేతనం తీసుకుంటున్నాడు.

**వ్యాపార ప్రకటనల ద్వారా రోజు రూ.7 నుంచి 10 కోట్లు**
కోహ్లీ వ్యాపార ప్రకటనల ద్వారాఎక్కువ మొత్తం ఆర్జిస్తున్నాడు. రోజుకు రూ.7 నుంచి 10 కోట్లు వసూలు చేస్తున్నాడు. వివో, మింత్రా, గ్రేట్ లర్నింగ్, నాయిస్, వ్రాగన్, బ్లూస్టార్, టూయమ్మీ, ఓలిని, లక్సర్, హెచ్ఎస్‌బీసీ, ఊబర్, టూత్సీ, స్టార్ స్పోర్ట్స్, అమెరికన్ టూరిస్టర్, ఎమ్ఆర్ఎఫ్, సింథాల్ సంస్థలకు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నాడు.

**పెట్టుబడులు..**
కోహ్లీకి సొంతంగా రెండు రెస్టారెంట్స్ ఉన్నాయి. ఇవి కాకుండా ఫుట్‌బాల్ క్లబ్, టెన్నిస్ టీమ్, ప్రో రెజ్లింగ్ లీగ్‌ల్లో కూడా భాగస్వామిగా ఉన్నాడు. ఎమ్‌పీఎల్, డిజిట్, కాన్వో, యూనివర్సల్ స్పోర్ట్స్‌బిజ్, బ్లూట్రైబ్ వంటి కంపెనీల్లో కోహ్లీ పెట్టుబడులు పెట్టాడు. కోహ్లీ తన సతీమణి అనుష్క శర్మతో కలిసి SeVVA'అనే ఎన్‌జీవోను కూడా నడిపిస్తున్నాడు. విరాట్ కోహ్లీ ఫౌండేషన్ పేరిట పేద విద్యార్థులు, క్రికెటర్లకు స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్నాడు.

# టీమిండియాలో నో ఛాన్స్.. రిటైర్మెంట్‌పై స్పందించిన పుజారా



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇంగ్లాండ్ తో జరుగుతున్న ప్రతిష్టాత్మక టెస్ట్ సిరీస్ కు భారత క్రికెట్ జట్టులో టీమిండియా వెటరన్ బ్యాటర్ చటేశ్వర్ పుజారాకు స్థానం దక్కించుకోలేకపోయాడు. 2023 దక్షిణాఫ్రికా టూర్ లో భాగంగా ఈ సీనియర్ ప్లేయర్ ను సెలక్టర్లు తప్పించిన సంగతి తెలిసిందే. 2020 నుండి పుజారా ఫామ్ దిగజారుతూ వస్తుంది. గత నాలుగేళ్లలో పుజారా భారత్ తరపున 28 టెస్టు మ్యాచ్ లాడితే యావరేజ్ 30 కంటే తక్కువగానే ఉంది. కేవలం ఒకసారి మాత్రమే మూడంకెల స్కోర్ ను చేరుకోగలిగాడు. నిలకడగా రాణించలేకపోవడం పుజారాకు మైనస్ గా మారింది.దేశవాళీ క్రికెట్ లో బాగా రాణిస్తూ తనను తాను నిరూపించుకున్న పుజారా.. ఇంగ్లాండ్ సిరీస్ లో అవకాశం వస్తుందని భావించినా అది జరగలేదు. 100 టెస్టులు ఆడినా పుజారా అనుభవాన్ని ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇకపై టీమిండియాలో పుజారా చోటు దక్కించుకోవడం కష్టంగానే కనిపిస్తుంది. ఈ నేపథ్యంలో పుజారా తన రిటైర్మెంట్ పై స్పందించాడు. " క్రికెట్ కు నేను రిటైర్మెంట్ ప్రకటించే ఆలోచనలో లేను. నేను ఇంకా పూర్తి చేయాల్సిన పని ఉందని అనుకుంటున్నాను. నేను నా క్రికెట్‌ను ఆస్వాదిస్తున్నాను. నేను నా ఆటను కొనసాగిస్తాను. రిటైర్మెంట్ గురించి తరువాత ఆలోచిస్తాను. నాకు వర్తమానంలో జీవించడం ఇష్టం". అని పుజారా అన్నాడు.పుజారాకు ఇకపై టీమిండియాలో కనిపించడం దాదాపు అసాధ్యంగానే కనిపిస్తుంది. దశాబ్దకాలంగా భారత టెస్ట్ జట్టులో కీలక పాత్ర పోషించిన అతను ద్రవిడ్ వారసుడిగా పేరు తెచ్చుకున్నారు. ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ వంటి దేశాలలో భారత్ సాధించిన విజయాల్లో పుజారా కీలక పాత్ర పోషించిన సంగతి తెలిసిందే. మూడో స్థానంలో పుజారా అడ్డుగోడలా నిలబడుతూ నిలకడగా రాణించాడు. బాగా ఆడుతూ టెస్టుల్లో తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నాడు. ఇప్పటివరకు టీమిండియా తరపున 103 టెస్ట్‌ల్లో 43.60 సగటుతో 7195 పరుగులు చేశాడు. వీటిలో 19 సెంచరీలు.. 35 అర్ధ సెంచరీలు ఉన్నాయి. సౌరాష్ట్ర తరపున ఆడిన తర్వాత దేశీయ క్రికెట్‌లో ఆడుతున్నాడు .

# 'బలగం' బ్లాక్ బస్టర్ కానీ.. తనకేమైంది?

**బ్లూ డ్రెస్‌లో దిశా పటానీ డ్రీమీ లుక్ హృదయాలను గెలుచుకుంది**



టాలీవుడ్‌లో ఎప్పటికప్పుడు సమీకరణాలు మారిపోతున్నాయి. ప్రేక్షకులు ఓటీటీల ప్రభావంతో థియేటర్లకు రావడానికి పెద్దగా ఆసక్తిని చూపించడం లేదు. దీంతో స్టార్‌లని పక్కన పెడితే మిగతా ఆర్టిస్టలు, హీరోయిన్‌ల పరిస్థితి కొంత గందరగోళంగా తయారయింది. ఎవరు ఎప్పుడు ఏ సినిమాతో, ఏ సిరీస్‌లో ప్రేక్షకుల ముందుకొస్తారో.. అవకాశాలు లేక ఎప్పుడు కనుమరుగువుతారో తెలియడం లేదు. ఇప్పుడు ఇలాంటి పరిస్థితినే ఎదుర్కొంటోంది కావ్య కల్యాణ్ రామ్.



**చంద్రిక రవి గ్లామ్ తెరవెనుక క్షణం**

చైల్డ్ ఆర్టిస్ట్‌గా పదకొండు సినిమాల్లో నటించిన ట్రాక్ రికార్డ్ తన సొంతం. - గంగోత్రి - లో వల్లంకి పిట్ట పాటతో అందరినీ ఆకట్టుకుని పాపులర్ అయిన కావ్య కల్యాణ్ రామ్ హారర్ థ్రిల్లర్ మూవీ %-% మసూద%-%తో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చింది. తిరువీర్, సంగీత, బాంధవీ శ్రీధర్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సూపర్ నేచురల్ థ్రిల్లర్ బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని సాధించిన హీరోయిన్‌గా తొలి ప్రయత్నంలోనే సక్సెస్‌ని అందించింది. దీని తరువాత కమెడియన్ వేణు దర్శకత్వంలో దిల్ రాజు ఫ్యామిలీ వారసులు హర్షిత్‌రెడ్డి, హర్షితా రెడ్డి నిర్మించిన %-%బలగం%-%లో నటించింది. ప్రియదర్శి ప్రధాన పాత్రలో నటించిన ఈ మూవీ ఏ స్థాయిలో సంచలనం సృష్టించిందో ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. మళ్లీ పల్లెల్లోని జనం భారీ సంఖ్యలో థియేటర్లకు పరుగులు తీసేలా చేసి అలనాటి రోజుల్ని గుర్తు చేసింది. పల్లె పల్లెన, సిటీల్లోనూ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో చర్చనీయాంశంగా మారి దర్శకుడు వేణు, చిత్ర బృందంపై ప్రశంసల వర్షం కురిపించింది. చిన్న బడ్జెట్‌తో మనసుకు హత్తుకునే భావోద్వేగాల సమాహారంగా తెరకెక్కిన ఈ సినిమా నటుడిగా ప్రియదర్శికి, హీరోయిన్‌గా కావ్య కళ్యాణ్‌రామ్‌కు మంచి పేరు తెచ్చి పెట్టింది.ఈ సినిమా బ్లాక్ బస్టర్ హిట్ తరువాత ప్రియదర్శి హీరోగా బిజీ అయిపోయాడు. వరుసగా సినిమాలు చేస్తున్నాడు. తనని దృష్టిలో పెట్టుకుని దర్శకులు కథలు రాస్తూ సరికొత్త కథలని తెరపైకి తీసుకొస్తున్నారు. అయితే 'బలగం'లో హీరోయిన్‌గా నటించిన కావ్య కల్యాణ్ రామ్ కెరీర్ మాత్రం ఇందుకు భిన్నంగా సాగుతోంది. ఈ మూవీ తరువాత కావ్య 'ఉస్తాద్%-%తో ప్రేక్షకుల ముందుకొచ్చింది. 2023లో విడుదలైన ఈ సినిమా డిజాస్టర్ అనిపించుకుంది. అక్కడి నుంచి ఇంత వరకు కావ్య కల్యాణ్‌రామ్ నుంచి మరో సినిమా రాలేదు. ఆమె సినిమా చేసి దాదాపు రెండేళ్లవుతోంది. తను కావాలనే గ్యాప్ తీసుకుందా? లేక ప్రస్తుత పరిస్థితుల కారణంగా తనకు అవకాశాలు రావడం లేదా అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.



On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com